

రాజంపల్లిలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలి నెలలోనే పింఛన్ల హామీని నెరవేర్చింది. పేదలు, వృద్ధులు, అభాగ్యుల కళ్లలో ఆనందాన్ని నింపింది. ఇప్పటివరకూ ఉన్న సామాజిక పింఛన్ మొత్తం రూ.3వేల నుంచి ఒకేసారి రూ.4వేలకు పెంచి సోమవారం అందజేసింది. రాష్ట్రప్రభుత్వంలో కీలకమైన మంత్రి మొదలు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి నాయకులు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. యంత్రాంగంలో కలెక్టర్ నుంచి సచివాలయ సిబ్బంది దాకా వేలాది మంది పాల్గొన్నారు. పలుప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. వివిధ గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో గ్రూపు మీటింగ్‌లు ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం రాత్రికి 94.68శాతం వరకు పంపిణీ పూర్తయ్యింది.

వృద్ధాప్యంలో ఎంతో ఆసరా



గత ప్రభుత్వంలో పెన్షన్‌ను వెయ్యి రూపాయలు పెంచడానికే జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల సమయం తీసుకున్నారు. చంద్రబాబునాయుడు ఒకేసారి రూ.వెయ్యి పెంచుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సంతకం చేయడంతోపాటు జూలై 1నే ఇంటి వద్దనే ఇప్పించి మాటను నిలబెట్టుకున్నారు. సంక్షేమ పాలకుడు ఎవరంటే చంద్రబాబునాయుడే గుర్తుకొస్తున్నారు.

- నెలకుర్తి నాగరత్తమ్మ, పింఛన్ లబ్ధిదారు, పెద్దన్నపల్లి, పీసీపల్లి మండలం



ఒంగోలులో పింఛన్ సొమ్ము తీసుకున్న అనంతరం 'థ్యాంక్యూ బాబు గారూ' అన్న ప్లకార్డు పట్టుకొని ఆనందం వ్యక్తం చేసున్న వృద్ధురాలు

పింఛన్ పెంచి.. ఇంటికి చేర్చి..



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినెలలోనే హామీ అమలు

- రూ.4వేలకు పెంపుతోపాటు మరో రూ.3వేల బకాయి కలిపి రూ.7వేలు అందజేత
- పండుగలా సాగిన కార్యక్రమం
- మంత్రి నుంచి కార్యకర్త వరకూ భాగస్వామ్యం
- సచివాలయ సిబ్బందితో ఒక్కరోజులోనే 94.68 శాతం పంపిణీ
- ఆనందం వ్యక్తంచేస్తున్న లబ్ధిదారులు
- పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్‌కు నివాళులు
- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలు, ఫ్లెక్సీలకు పాలభిషేకం
- ఉదయం ఆరుగంటలకే వీధుల్లోకి టీడీపీ శ్రేణులు, అధికార యంత్రాంగం

ఒంగోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పింఛన్ల పండుగ చేశారు. పెంచిన ఎన్టీఆర్ భరోసా మొత్తాల పంపిణీని టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలోనూ అటు ప్రభుత్వ యంత్రాంగం, ఇటు టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాల పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2,91,524మంది వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, దివ్యాంగులు ఇతర వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పెంచిన పింఛన్ మొత్తాలు, అలాగే బకాయిలు కలిపి సుమారు రూ.199.07 కోట్లు మేర పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయం ఆరు గంటల నుంచే ప్రక్రియ ప్రారంభం కాగా మధ్యాహ్నానికే మూడొంతులు పంచారు. అలా రాత్రి తొమ్మిది గంటలకు సుమారు 94.68 శాతంతో 2,78,028 మందికి పింఛన్ నగదును అందజేశారు. మిగిలిన లబ్ధిదారులు మంగళవారం పంపిణీ చేయనున్నారు.

రాజంపల్లిలో మంత్రి పంపిణీ

జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, టీడీపీ నాయకులు దామచర్ల సత్యలు ఉదయం ఏడు గంటలకే తమ స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి స్వామి దర్శి మండలం రాజంపల్లిలో పింఛన్లు పంపిణీ చేయగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ఆతర్వాత మద్రిపూడి మండలంలో మంత్రి స్వామి పాల్గొనగా సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాల్లో సత్య హాజరయ్యారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని ఐదారు డివిజన్లలో పలు ఇళ్లకు తిరిగి పింఛన్లు పంపిణీ చేయడంతోపాటు సాయంత్రం అద్దంకి బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద దివ్యాంగులు నిర్వహించిన చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయుమార్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని దాదాపు పది గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు స్థానిక నేతలు అధికారులతో కలిసి పాల్గొన్నారు.

కనిగిరిలో పండుగ వాతావరణం..

కనిగిరి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉదయం ఆరు గంటలకే కనిగిరి పట్టణంలోని పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం సాయంత్రం వరకూ నియోజకవర్గంలోని ఇతర మండలాల్లో పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తొలుత గిద్దలూరు పట్టణంలోనూ తర్వాత కంభంతోపాటు ఇతర మండలాల్లోనూ పింఛన్‌లు పంపిణీ చేశారు.

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంతోపాటు రూరల్ మండలం, అలాగే ఇతర మండలాల్లోని గ్రామాల్లో పాల్గొన్నారు. టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఉదయాన్నే ఎర్రగొండపాలెంలోనూ అనంతరం ఇతర మండలాల్లో పింఛన్‌లను పంపిణీ చేశారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఉదయం రాజంపల్లిలో మంత్రి స్వామితో కలిసి పింఛన్‌లు పంపిణీ చేశారు. అనంతరం తాళ్లూరు, ఇతర మండలాల్లో పాల్గొన్నారు అలాగే జిల్లాని అన్ని ప్రాంతాల్లో పంపిణీ చేశారు. నగదుతోపాటు పింఛన్ సర్టిఫికెట్, ముఖ్యమంత్రి చంద్రబాబు పేరుతో ఉన్న లేఖపత్రంను లబ్ధిదారులకు అందజేశారు. పలుచోట్ల చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలు, ఫ్లెక్సీలకు పాలభిషేకం చేశారు. సోమవారం రాత్రి 9గంటల సమయానికి మొత్తం 2,92,524 మంది లబ్ధిదారులకుగాను, 2,78,028 మందికి పంపిణీ చేశారు. ఇంకా 16,496మందికి ఇవ్వాల్సి ఉంది. వారందరికీ మంగళవారం పంపిణీ చేయడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.



ఒంగోలు బాలాజీనగర్‌లో దివ్యాంగుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్



టంగుటూరులో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న వృద్ధులు



అర్ధవీడు మండలం నాగులవరంలో వృద్ధురాలికి పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



పేర్నమిట్టలో వృద్ధురాలికి పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఎర్రగొండపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



కనిగిరిలో 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే ఉగ్ర



దరిమడుగులో లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల

చేస్తాం.. చూస్తాం అంటే కుదరదు

- ప్రతిరోజూ 'మీ కోసం' వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందే
- కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1: 'చేస్తాం... చూస్తాం.. నివేదికలు వచ్చాక పరిశీలించి చర్యలు తీసుకుంటాం' అని అర్జీదారులకు మొక్కుబడిగా సమాధానాలు చెప్తే సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జరిగిన మీకోసం అర్జీల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ఆమె సమీక్షించారు. అన్నిశాఖల అధికారులు ప్రతిరోజూ మీ కోసం వెబ్‌సైట్‌ను పరిశీలించి అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి వచ్చే వినతులు స్థానికంగా పరిష్కారం కానివైతే ఉన్నతాధికారులకు నివేదించి అవి ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకుంటూ ఉండాలని ఆదేశించారు. విషయాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. అలాకాకుండా మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్డీసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వృద్ధురాలి దారుణహత్య

- అల్లుడే చేశాడని అనుమానం
- ఏడాది క్రితం భార్యను హతమార్చాడు
- ఇప్పుడు బెయిల్‌పై బయట

మార్కాపురం రూరల్, జూలై 1: వృద్ధురాలిని గొంతు కోసి హత్య చేసిన ఘటన వేములకోట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెసాని నారాయణమ్మ (60) ఆమె నివాసంలో ఆరుబయట నిద్రిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గొంతు కోసి పరారయ్యాడు. నారాయణమ్మ కుమారుడు ఉదయం నిద్రలేచి తల్లిని చూడగా రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ బాలసుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును, ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఏఎస్పీ శ్రీధర్‌బాబు హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకొంది. నారాయణమ్మ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నారాయణమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

అల్లుడిపైనే అనుమానం

మృతురాలు నారాయణమ్మను ఆమె అల్లుడు రేలా శ్రీను గొంతు కోసి హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఏడాది క్రితం భార్య సునీతను రోకలి బండతో మోది శ్రీను హత్య చేశాడు. ఆ కేసులో ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే అత్తపై కూడా కక్ష పెంచుకొని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమికంగా సమాచారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ హత్య కేసులో అనుమానిత వ్యక్తి రేల శ్రీను పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగులకు ఊరట

- తొలిరోజే 60శాతం మందికి జీతాలు
- నేడు మిగతావారికి పడే అవకాశం
- వైసీపీ ప్రభుత్వంలో నెలంతా ఎదురుచూపులే

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు నెలంతా డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ పరిస్థితి నుంచి ఎట్టకేలకు వారు బయటపడ్డారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలతోపాటు ఉద్యోగులు కూడా తమకు సకాలంలో జీతాలు అందుతాయని ఆశించారు. అందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1వతేదీ అయిన సోమవారం పండుగ వాతావరణంలో సామాజిక పింఛన్లు ఒకవైపు పంపిణీ చేయిస్తూనే ఇంకోవైపు ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో వేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 40వేలమందికిపైగా ఉద్యోగులు ఉండగా సోమవారం సాయంత్రానికి సుమారు 60శాతం మందికి జీతాలు పడ్డాయి. అంటే 25వేల మందికిపైగా జీతాలు ఒకటో తేదీనే అందడంతో వారిలో కూడా ఆనందం వెల్లివిరుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. కనీసం పెంచకపోయినా పర్వాలేదు, ఒకటో తేదీనే ఇవ్వాలని ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా గత జగన్ సర్కార్ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే అటు సామాజిక పింఛన్‌దారులకు, ఇటు ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. సోమవారం రాత్రికి లేదా మంగళవారం ఉదయానికి మిగిలిన ఉద్యోగులకు కూడా జీతాలు పడే అవకాశం ఉందని ట్రెజరీ శాఖ అధికారులు చెప్తున్నారు. విశ్రాంత ఉద్యోగులకు కూడా బిల్లులు జనరేట్ అయిన వెంటనే పెన్షన్లు అందనున్నాయి. సోమవారం ఉదయం నుంచే ఉద్యోగులకు తమ అకౌంట్లలో జీతాలు పడినట్లు మేసేజ్‌లు రావడంతో వారిలో విస్తృత చర్చ జరిగింది. గత ప్రభుత్వంలో జీతాల కోసం ఎదురుచూసే వాళ్లమని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అతిసారను నివారిద్దాం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

అతిసార ప్రబలకుండా చర్యలు

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : జిల్లాలో ఎక్కడా అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమిమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం అతిసారను నివారిద్దాం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యాధుల నివారణకు తగిన చర్యలను వైద్య శాఖ తీసుకోవాలన్నారు. గృహ సందర్శనలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లందరికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానాన్ని ఆశాలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు వారి పరిధిలోని గ్రామ, వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, డీఐవో డాక్టర్ పద్మజ తదితరులు ఉన్నారు.

పేద వర్గాలకు లయన్స్ సేవలు అందించాలి

ఒంగోలు(కల్చరల్),జూలై 1:సమాజంలోని నిరుపేద వర్గాలకు లయన్స్ క్లబ్ సేవలను అందించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు అన్నారు. సోమవారం స్థానిక మౌర్యా హోటల్‌లో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు క్లబ్ నూతన ఛైర్మన్ డాక్టర్ ఉమాపతి చౌదరి ఘనస్వాగతం పలికారు. అనంతరం క్లబ్ గవర్నర్ హరిప్రసాద్ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను వివరించారు. ఒంగోలు నగరంలో లయన్స్ క్లబ్ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే శాశ్వత భవనాన్ని నిర్మిస్తామని కోరగా అందుకు ఎమ్మెల్యే దామచర్ల సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. అనంతరం నూతన ఛైర్మన్ డాక్టర్ ఉమాపతి చౌదరి, కార్యదర్శి దాసరి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామకృష్ణలకు దామచర్ల అభినందనలు తెలిపారు. అనంతరం దామచర్లను ఉపాస్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రకాష్ చావల, ఇతర వైద్యులు ఘనంగా సత్కరించారు.


దామచర్లను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

వాసవి విద్యానిధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 1 : నగరంలోని సీతారాంపురంలోని శ్రీ వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతి గృహం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యానిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వాసవి విద్యానిధి నూతన కమిటీ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేయాలని అన్నారు. అలాగే తన వంతు సహకారాన్ని అందిస్తానని దామచర్ల తెలిపారు. అనంతరం అధ్యక్షులుగా కనమర్లపూడి హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పల్లపోతు దుర్గా ప్రసాద్, కోశాధికారిగా రామాంజనేయులుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కొప్పురావూరి సురేష్, బీఎంఆర్, తాతా చెంచయ్య గుప్తా, పబ్బిశెట్టి భాస్కర్, తాతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న దివ్యాంగులు

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పెంపు చేసి, అందరికీ ఒకటో తేదీనే ఇళ్ల వద్ద అందజేయడం పట్ల దివ్యాంగులు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. సోమవారం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

కుమారి సేవలు అభినందనీయం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 1 : బ్యాంక్ ఆఫ్ బరోడాలో అటెండర్‌గా విధులు నిర్వర్తించిన కొండ్రకొండ కుమారి సేవలు అభినందనీయం అని బ్రాంచ్ చీఫ్ మేనేజరు మార్నేని సుబ్రమణ్యం తెలిపారు. కుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం స్థానిక ఎంఎస్ఎంఈ బ్రాంచ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ బరోడా అన్నీ బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొని ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా అన్నీ బ్రాంచ్‌ల సిబ్బంది, వినియోగదారులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అయ్యపరెడ్డి డిమాండ్ చేశారు. క్రిమినల్ చట్టాలను నిరసిస్తూ ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అద్దంకి బస్టాండు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు ,బీవీ రావు, మహ్మద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్‌ను బ్లాక్ చేయడం హేయం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : చీమకుర్తిలోని ఆంధ్రప్రగతి బ్యాంకులో రుణం తీసుకున్నానని, ఆబ్యాంకు మేనేజర్ తనకు తెలియకుండానే నా అకౌంట్‌ను సీజ్ చేశారని ఆ మండలంలోని మువ్వవారిపాలెంకు చెందిన ఆర్. శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బ్యానర్ పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. తన పట్టాదారుపుస్తకాన్ని బ్యాంకులో పెట్టి క్రాప్(పంటలోను) లోను తీసుకున్నాని తెలిపారు. ఆ లోనుకు సంబంధించి వడ్డీకూడా తనకు తెలిజేయకుండా ఖాతాను నిలిపివేశారని ఆరోపించారు. ఈ విషయంపై తాను మేనేజర్‌ను కలిసి మాట్లాడగా దురుసుగా సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు.

పేదలకు భరోసా ఘనత టీడీపీదే !

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

ఒంగోలులో పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే దామచర్ల

హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన లబ్ధిదారులు


ఒంగోలు ఆర్పీ రోడ్డులో పింఛన్ల పంపిణీ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు

ఒంగోలు (కార్పొరేషన్). జూలై 1 : పేదల పక్షాన పనిచేసే ప్రభుత్వం తెలుగు దేశం పార్టీ అని, చెప్పిన హామీలకు కట్టుబడి చంద్రబాబు నాయుడు ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచడమే కాకుండా హామీ ఇచ్చిన రోజు నుంచి నేటి వరకు అదనంగా మరో రూ. 3వేలు అందించి భరోసా కల్పించిన ఘనత టీడీపీకి దక్కుతుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు పేర్కొన్నారు. వృద్ధాప్య,


పెన్షన్ అందజేస్తున్న దామచర్లతో తన సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

వితంతు, వికలాంగుల పింఛన్‌లను సోమవారం ఒంగోలునగరంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. నగరంలోని 16వ డివిజన్ అగ్రహారం, 3వ డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీ, 50వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ, 33వ డివిజన్‌లో జడ్పీ కాలనీలోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. రూ. 2వేలు ఉన్న పింఛన్‌ను రూ. 3వేలు చేస్తామని చెప్పి, ఏడాదికి రూ. 250 పెంచి, ఐదేళ్ళకు రూ. 3వేలు చేశారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలను మోసం చేసిన జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని దామచర్ల పేర్కొన్నారు పేదల సంతోషం, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని దామచర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనరు ఎం.జశ్వంత్‌రావు, సచివాలయ సెక్రటరీలు, పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో పింఛన్ పండుగ

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు పండగ వాతావరణంలో నిర్వహించారు. ఒంగోలు నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామం, నగర పరిధిలోని ప్రతి డివిజన్‌లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్‌ల నాయకులు ఉదయం 6గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛన్‌లు అందజేశారు. సచివాలయాల సెక్రటరీలతో అందించగా పలు సచివాలయాల్లో సెక్రటరీలు సెలవులు ఉండటంతో కార్పొరేషన్ కార్యాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించారు. దీంతో తెలుగు తమ్ముళ్లు వారితో కలిసి పెరిగిన పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. మహానుభావుడు చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పింఛన్ పెంచి, తమకు అండగా నిలిచారని పలువురు పెన్షన్‌దారులు తమ హర్షం వ్యక్తం చేశారు.

కోలాహలంగా పింఛన్ల పంపిణీ


ఉలిచిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఒంగోలు(రూరల్), : ఒంగోలు రూరల్ మండలంలో ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కోలాహలంగా జరిగింది. సోమవారం రూరల్ మండలంలోని మండువవారిపాలెంలో గ్రామ సర్పంచ్ మండవ వెంకట సుబ్బయ్య, ఉపసర్పంచ్ బాబురావు, యరజర్లలో ఎంపీటీసీ సభ్యుడు గుండపనేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, సర్వేరెడ్డిపాలెంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముక్కెన శ్రీనివాసరావు, గ్రామనాయకులు పుచ్చకాయల సుబ్బారావు, దశరాజుపల్లిలో గ్రామ నాయకులు యానాదినాయుడు, పులిచర్ల మోహన్‌రెడ్డిలు పింఛన్లు పంపిణీ చేశారు.

ఉలిచిలో

ఒంగోలు(కల్చరల్) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల కార్యక్రమాన్ని ఒంగోలు రూరల్ మండలం ఉలిచి గ్రామంలో సోమవారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి నారా


మండువవారిపాలెంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి పొగాకు సమాఖ్య మాజీ అధ్యక్షుడు చుంచు శేషయ్య వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో గుండ్లకమ్మ సాహిత్య సేవాసమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చుంచు సింగయ్య, యర్రంనేని నరసింహారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.కాంచన, యర్రంనేని వెంకట శేషయ్య పిల్లుట్ల సుధాకర్ రావు, కావూరి అశోక్, కాటి అంజయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల్లో పండుగ వాతావరణం

సంతనూతలపాడు, జూలై 1: ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట తప్పకుండా వృద్ధులు, వితంతువులకు, దివ్యాంగులకు గతప్రభుత్వం కంటే మెరుగ్గా పెన్షన్ పెంపుదల చేయడంతో పెన్షన్ లబ్ధిదారుల్లో పండుగవాతావరణం మొదలైందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం టీడీపీ ప్రభుత్వం పెంచిన ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ రూ.7వేలను లబ్ధిదారులకు పేర్నమిట్టలోను, పేర్నమిట్ట పరిధిలోని 41, 42 డివిజన్‌లలోను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు స్వయంగా అధికారుల సమక్షంలో పెన్షన్ డబ్బులను అందజేశారు. ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. చంద్రబాబు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చిత్రపటాలకు అభిమానులు పాలభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు, శివపురం రుద్రయ్య, వివరం గోవిందు, ఈదర విష్ణు, కరిచేటి శ్రీను, ఎమ్.లక్ష్మణరావు, వాసు, మద్దినేని హరిబాబు, అడకా స్వాములు, ఆళ్లరాము, సాధినేని శ్రీరామ్మూర్తి చెరుకూరి శ్రీను, తన్నీరు శ్రీను, ఆర్.అంకారావు, ఎమ్.రంగమ్మ, శంకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు

మద్దిపాడు :ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మద్దిపాడులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పెన్షన్లు అందజేస్తున్నామని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పెన్షన్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులకు రూ.7వేల పెన్షన్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, ఎంపీడీవో శ్రీహరి, గ్రామ కార్యదర్శి ఆశాజ్యోతి, వీఆర్వో రమణారావు, సీతారాంపురం సర్పంచ్ మండవ శివానందరావు, అప్పల కుమార్ స్వామి, నర్రా సురేష్, ముల్లూరి మురళి, మండవ గోపి, పాటిబండ్ల అజయ్ బాబు, వడ్డెంపూడి శ్రీనివాసరావు, నారిపెద్ది వరహాల చౌదరి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.


సంతనూతలపాడులో పెన్షన్ నగదును అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

ఊరూరా పెన్షన్ల పండుగ

ఇక మండలంలోని ప్రతి ఊరిలో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో టీడీపీ నాయకులు సచివాల ఉద్యోగులు కలిసి పెన్షన్లను పంపిణీ చేశారు. గుండ్లాపల్లిలో మండవ జయంతి బాబు, పోకూరి శ్రీనివాసరావు, వెల్లంపల్లిలో చిట్టిబోయిన అనిల్ యాదవ్, దుర్గాభవాని, నాగన్నపాలెంలో కాకర్ల విజయ్‌కుమార్, మల్లవరంలో నారిపెద్ది వరహాల చౌదరి, మారినేని సుబ్బారావు, లింగంగుంటలో మన్నం కృష్ణ కిషోర్, నల్లూరి నరసింహారావు, గడియపూడి కాలనీలో అన్నమనేని సుబ్బారావు, చింతల శ్రీనివాస రావు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.


చీమకుర్తిలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని పలు గ్రామాలలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నగదును లబ్ధిదారులకు సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్‌కుమార్ అందజేసి మాట్లాడారు. రాపర్ల, వినోదరాయునిపాలెం తదితర గ్రామాలలో జడ్పీ సీఈవో కె.మాధురీ, ఎంపీడీవో మహాలక్ష్మి, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి తదితరులు లబ్ధిదారులకు పెన్షన్‌ను అందించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పెరిగిన పింఛన్ల పంపిణీ సోమవారం చీమకుర్తిలో పండగ వాతావరణంలో జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు అర్హులైన వారి ఇంటికి వెళ్లి ఏడు వేలు రూపాయలు అందిస్తుంటే పింఛన్‌దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివెరిసాయి.చీమకుర్తి మండలంలో చీమలమర్రి,చీమకుర్తి పట్టణంలో అంబేడ్కర్‌నగర్, క్రిస్టియన్ పాలెంలో ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ పింఛన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వా,తాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తుండటం సంతోషంగా ఉందన్నారు. అన్ని చోట్ల టీడీపీ నాయకులు,శ్రేణులు ఉత్సాహంగా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అంబేడ్కర్ నగర్‌లో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, పూనాటి వెంకట్రావు, రావిపాటి రాంబాబు, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, పమిడి రవితేజ,ముదివర్తి రాధాకృష్ణమూర్తి, వజ్జా సుబ్బారావు, పారా కృష్ణ, కరిచేటి రాఘవయ్య, వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని రాము, బీజేపి నాయకులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం


డాక్టర్‌కు గులాబీలు అందిస్తున్న విద్యార్థులు

ఒంగోలు(కల్చరల్),జూలై 1:జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సంతపేట టైనీ బెల్స్ ప్రీ స్కూల్ విద్యార్థులు దుర్గా నర్సింగ్ ప్రసూతి వైద్యురాలు డాక్టర్ శైలజకు గులాబీలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె వారికి చాక్లెట్లు అందించి ఆరోగ్యపరంగా చిన్నతనం నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ చంద్రశేఖర్, డైరెక్టర్ సుజితా శేఖర్‌లు పాల్గొన్నారు. అటు స్థానిక సుజాతనగర్‌లోని అపెక్స్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన జాతీయ వైద్యుల దినోత్సవంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ డాక్టర్ చాపల వంశీకృష్ణ పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, మానసిక శక్తి, జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి దోహదపడే ఆహార నియమాలను వివరించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ శివకోటి రెడ్డి, ఏవో ఎస్‌కే బాషా, సోషల్ మీడియా అడ్మిన్ కే.శివా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విస్ హైస్కూలులో..

ఒంగోలు(విద్య) : స్థానిక కర్నూలు రోడ్డులోని క్విస్ హైస్కూలులో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు డాక్టర్ వేషధారణలో వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న క్విస్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి కల్యాణ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రిలు మాట్లాడుతూ వైద్యులు దేవుని ప్రతి రూపాలని, వైద్యవృత్తిని చేపట్టి రోగులకు ప్రాణదానం చేయాలని సూచించారు. విద్యార్థులు డాక్టర్లు అయ్యేందుకు ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. వైద్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు.


వెలిగొండ ప్రాజెక్టుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వెలిగొండ పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : వెలిగొండ ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనుల స్థితిగతులు, వీటిని పూర్తి చేసేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపు, పునరావాస, పునర్ నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్, కోర్టు కేసులు తదితర అంశాలపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వెలిగొండ ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున పెండింగ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన బడ్జెట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని స్పష్టంచేశారు. ఈ దిశగా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రాజెక్టు ఎస్ఈ అబూత్ ఆలీమ్‌ను ఆదేశించారు. నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి ప్రజల అభ్యంతరాలు, సమస్యలను తెలుసుకొని తనకు నివేదించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీ మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రూన్సీ లక్ష్మి ఇతర అధికారులు ఉన్నారు.

విద్యార్థులతో నేను బడికి పోతా ర్యాలీ

ఒంగోలు(విద్య), జూలై 1: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక గద్దలగుంటలోని శ్రీ పింగళి కోదండరామయ్య సంస్కృతాంధ్ర విద్యాలయం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు పాఠశాలలో నమోదు కాని, పాఠశాలల్లో చేరి మధ్యలో చదువు మానేసిన వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ ర్యాలీలో ఒంగోలు ఎంఈవో-2 పి. సరస్వతి, పాఠశాల కరస్పాండెంట్ ఎన్. కోట సూర్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ చలపతిరావు, ఉపాధ్యాయులు ఆనంద్, సోమినేని సురేష్ తదితరులు ఉన్నారు.

టీచ్ టూల్ శిక్షణ ఎంతో ఉపయుక్తం

తరగతి గదిలో జరిగే బోధనాభ్యసన ప్రక్రియను అంచనా వేసేందుకు టీచ్ టూల్ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఒంగోలు డివిజనల్ ఉప విద్యాధికారి అనితా రోజ్‌రాణి అన్నారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో సోమవారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఒంగోలు మండల విద్యాధికారి టి. కిషోర్‌బాబు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీచ్ టూల్ శిక్షణకు 11 మండలాల నుంచి కేటాయించిన 95 మంది పరిశీలకులు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వెంకట్రావు, మాస్టర్ ట్రైనర్లు 11 మండలాల అబ్జర్వర్లు పాల్గొన్నారు.

విమాన ల్యాండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

● లోక్‌సభలో ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : సింగరాయకొండ వద్ద విమాన ల్యాండింగ్ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో 377 కింద ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రకృతి వైపరీత్యాలు, కార్యాచరణ, ఆకస్మిక పరిస్థితులు సంభవించినప్పుడు విమానాలు దిగుటకు, అత్యవసర ల్యాండింగ్ ఫెసిలిటీలు ఏర్పాటులో ఒంగోలు పార్లమెంట్‌పరిధిలోని సింగరాయకొండ వద్ద 3.60 కి.మీ. మేర ఎంపిక చేశారన్నారు. ఆ పనులకు, భూసేకరణకు రూ. 26.60 కోట్ల అంచనాతో విజయవాడలోని నేషనల్ హైవే అథారిటి రీజనల్ ఆఫీస్ ఆమోదానికి గత ఏడాది జనవరి 25న పంపించామన్నారు. 17 నెలలు గడుస్తున్నా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. అందువల్ల వెంటనే ఆ ప్రతిపాదనలు ఆమోదించి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట కోరారు.


మంచికంటిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మంచికంటికి విశాలాక్షి పురస్కారం

ఒంగోలు(కల్చరల్), జూలై1: జిల్లాలోని మరో గ్రంథాలయ ఉద్యమ నాయకులు మంచికంటి వెంకటేశ్వర రెడ్డిని నెల్లూరు విశాలాక్షి మాసపత్రిక నిర్వాహకులు విశాలాక్షి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ నవలా రచయిత్రి శీలా సుభద్రాదేవి మాట్లాడుతూ పిల్లలలో పఠనాశక్తిని పెంపొందించటానికి మరో గ్రంథాలయ ఉద్యమం ఎంతో ఉపకరిస్తుందని, అటువంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన మంచికంటి వెంకటేశ్వర రెడ్డికి పురస్కారాన్ని అందజేయటం ఎంతో సముచితంగా ఉందన్నారు. ఉద్యమ ప్రతినిధులు చావలి సుధాకర్, నల్లూరి క్రాంతి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్యలు ఈ సందర్భంగా మంచికంటి వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : మీకోసం కార్యక్రమంలో వీల్‌చైర్, శ్రవణ యంత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కలెక్టర్ తమీమ్ అన్సారియా వీల్ చైర్, శ్రవణ యంత్రాలను అందజేశారు. స్థానిక స్పందన హాలులో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో వీల్‌చైర్, శ్రవణ యంత్రాల కోసం దరఖాస్తులను అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా వెంటనే దివ్యాంగుల శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఒంగోలుకు చెందిన షేక్ రఫీక్‌కు వీల్‌చైర్‌ను, మద్దిపాడు మండలంకు చెందిన పద్మనాభం సురేష్, బల్లికురవకు చెందిన ముత్యాలుశ్రీను అనే బధిరులకు శ్రవణ యంత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జి. అర్చనలు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు

అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు(క్రైం),జూలై1: ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామని అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి 55 మంది తమ సమస్యలపై వినతులను అందజేశారు. ఫిర్యాదుదారులు నేరుగా వచ్చి పోలీసు అధికారులకు తమ వినతులను అందించారు. వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకొని చట్ట ప్రకారం విచారించి సత్వరమే పరిష్కరించమని అధికారులకు అదనపు ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్ కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్సై రజియా తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాసరావు

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు

టంగుటూరు, జూలై 1 : విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎన్‌ఆర్‌ఐ నార్నె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన ఉప్పితెర్ల నాగవెంకటసాయికి రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన చిడిపోతు అమృతకు రూ.30వేలు, మూడో స్థానంలో నిలిచిన యెహోషువాకు రూ.20వేలు నగదు బహుమతిగా అందజేశారు. జాతీయ పోటీలకు ఎంపికైన సుదర్శి పూజితకు రూ.25వేలు, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన వాకా హైమావతికి రూ25వేలు ఆయన పంపిణీ చేశారు. హెచ్‌ఎం వాకా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా పాఠశాల ఉన్నతికి పాటుపడుతున్న ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాసరావు ఈసారి స్వయంగా హాజరుకావడం అభినందనీయమన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాసరావు, విద్యాదాత ఆలం రామారావు, పూర్వ ఉపాధ్యాయులు దామచర్ల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, సుబ్బారావుతోపాటు పాఠశాల ఉన్నతికి అహర్నిశలూ శ్రమిస్తున్న గణిత ఉపాధ్యాయుడు దామచర్ల శ్రీధర్, తెలుగు ఉపాధ్యాయుడు సురేష్‌ను సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిళ్లా ఝాన్సీ, విద్యాదాతలు చిడిపోతు వెంకటేశ్వర్లు, దివి హరిబాబు, నార్నె మోహనరావు, నార్నె రామారావు, బడుగు వేణు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు మంత్రి స్వామి పరామర్శ

సింగరాయకొండ, జూలై 1 : మండలంలోని మూలగుంటపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత, 4వ వార్డు సభ్యుడు సన్నెబోయిన వెంకట్రావు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనతోపాటు ద్విచక్రవాహనంపై ఉన్న భార్యకు కూడా గాయాలయ్యాయి. వెంటనే వారిని కుటుంబ సభ్యులు ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సోమవారం ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

త్వరలో కామేపల్లి రోడ్డుకు మరమ్మతులు

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వెల్లడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండపి, జూలై 1 : మండలంలోని కామేపల్లి రోడ్డు మరమ్మతులు త్వరలోనే చేపడతామని ఆర్‌అండ్‌బీ ఒంగోలు సర్కిల్ ఎస్‌ఈ కె.దేవదానం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని చెప్పారు. 'అధ్వానంగా కామేపల్లి రోడ్డు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వావిలేటిపాడు-కామేపల్లి-కొండపి రోడ్డులో 23/0 నుంచి 31/6 వరకూ మరమ్మతులకు గుర్తైందన్నారు. మరికొద్ది రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి


పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

దేవరపల్లి(పర్చూరు), జూలై 1 : ప్రజా కూటమి ఘన విజయం, ఎమ్మెల్యే ఏలూరి అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమల తిరుపతికి దేవరపల్లి తెలుగుదేశం పార్టీ నేతలు చేపట్టిన పాదయాత్రను సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. పాదయాత్రకు పెద్ద పెత్తున ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పాదయాత్ర చేసే యువకులకు ఆయురారోగ్యం ఇవ్వాలని, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాపు రవిచంద్ర, కొమ్మాలపాటి సురేష్, కొరిటాల సురేష్, కొరిటాల శ్రీనివాసరావు, గండు నాగేశ్వరరావు, తోకల రాజశేఖర్, దొప్పలపూడి రాంబాబు, వేణుబాబు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలని ఫుట్‌పాత్ వ్యాపారుల ఆందోళన


ధర్నా చేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

కనిగిరి, జూలై 1: పట్టణంలోని చెప్పులబజారులో ఉన్న రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌పై ఉన్న బంకులను తొలగించేందుకు సోమవారం మున్సిపల్ అధికారులు ఉపక్రమించారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ వ్యాపారులు ఆందోళనకు దిగి రాస్తారోకో, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బంకులను తొలగించకుండా ఎక్స్‌కవేటర్‌లకు అడ్డంగా కూర్చున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ వీధి వ్యాపారులకు చట్టం ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా బంకులు తొలగించటం అన్యాయమన్నారు. బలవంతంగా బంకులు తొలగించే ప్రయత్నం మానుకోవాలని, వీధి వ్యాపారుల ఉపాధిని దెబ్బతీసే విధానాన్ని వీడాలని కోరారు. బంకులు తొలగింపు నిర్ణయం ఉపసంహరించుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఫుట్‌పాత్ వ్యాపారులు పాల్గొన్నారు.

కచ్చితమైన అంచనాలకు ప్రోత్సాహకాలు


విజేతలకు చెక్కులు అందజేస్తున్న బీఎం ఐవీ సుబ్బారావు

మార్కాపురం, జూలై 1: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఏ స్థానంలో ఎవరు గెలుస్తారు అనే విషయంలో కచ్చితంగా అంచనా వేసిన వారిలో విజేతలకు 'ఆంధ్రజ్యోతి' ఒంగోలు యూనిట్ బ్రాంచి మేనేజర్ ఐవీ సుబ్బారావు సోమవారం నగదు బహుమతి చెక్కులను అందజేశారు. 'రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరుతో 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కౌంటింగ్‌కు ముందు ప్రతిరోజూ కూపన్‌ను ప్రచురించారు. ఈ వినూత్న ప్రయోగానికి వేలాది మంది స్పందించారు. వారి వారి అంచనాలను అనుగుణంగా కూపన్లను త్రోవగుంటలోని 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ కూటమి 10 సీట్లు, వైసీపీ 2 అసెంబ్లీ సీట్లు గెలవడంతోపాటు ఏ స్థానంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడు అనే విషయంలో కచ్చితమైన అంచనా వేసిన వారి కూపన్ల నుంచి డ్రా తీసి విజేతలను నిర్ణయించారు. వీరిలో జిల్లా ప్రథమ బహుమతికి మార్కాపురం పట్టణానికి చెందిన ఎం.గుల్జాన్ ఎంపికయ్యారు. ద్వితీయ బహుమతిలో భాగంగా ముగ్గురిని ఎంపిక చేశారు. ఒకరు పెద్దారవీడు మండలం కొత్తపల్లికి చెందిన తిరుమలరెడ్డి లక్ష్మీదేవి, మరొకరు మార్కాపురం పట్టణానికి చెందిన బి.రాజేష్‌లు ఉన్నారు. రాష్ట్ర స్థాయి లక్కీడిప్-2గా ఒంగోలుకు చెందిన ఏ సాంబశివరావు ఎంపికయ్యాడు. మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐవీ సుబ్బారావు ప్రథమ బహుమతి విజేత ఎం.గుల్జాన్‌కు రూ.10,000, ద్వితీయ బహుమతి విజేతలు టి.లక్ష్మీదేవి, బి.రాజేష్‌లకు రూ.5000 చెక్కులను అందజేశారు. రాష్ట్రస్థాయి లక్కీడిప్‌లో గెలుపొందిన ఏ సాంబశివరావుకు రూ.10,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ వీవీ రమణ. ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మంత్రి

తూర్పునాయుడుపాలెంలో పింఛన్‌ల పంపిణీ ప్రారంభం


తూర్పునాయుడుపాలెంలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి డాక్టర్ స్వామి, టీడీపీ నేత సత్య

టంగుటూరు, జూలై 1 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఆయన సోమవారం ఉదయం ఆరు గంటలకు పింఛన్‌ల పంపిణీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పింఛన్‌ను ఒకేసారి రూ.వెయ్యి పెంచి నెలకు రూ.4వేలు ఇస్తున్నదని చెప్పారు. కొత్త ప్రభుత్వం అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు పెంచి పంపిణీ చేస్తున్నదని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ ఇస్తామన్నారు. తొలుత తూర్పునాయుడుపాలెంలోని కోనేటి ఒడ్డునున్న శ్రీఆంజనేయస్వామి విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి స్వామి పూజలు చేశారు. అనంతరం ఎస్సీ కాలనీలోకి ప్రవేశించారు. ముందుగా కసుకుర్తి రవీంద్ర అనే దివ్యాంగురాలికి పింఛన్ సొమ్ము అందించారు. అనంతరం అద్దంకి రామయ్యకు వృద్ధాప్య పింఛన్‌ను ఇచ్చి ఆయనచేతనే ముఖ్యమంత్రి సందేశం చదివించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, సర్పంచ్ తలపనేని రవికుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాతూరి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం

పింఛన్‌ల పంపిణీ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం కన్పించింది. పలుచోట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలు, ఫ్లెక్సీలకు టీడీపీ, జనసేన నాయకులు, పింఛన్ లబ్ధిదారులు పాలభిషేకం చేశారు. టంగుటూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, జక్కుల శ్రీను పాల్గొన్నారు. కొణిజేడులో రామాగోపి, జమ్ములపాలెంలో మక్కెన వెంకట్రావు, కాకుటూరివారిపాలెంలో వెంకట్రావు, అనంతవరంలో కసుకుర్తి భాస్కర్, టంగుటూరు అంబేడ్కర్ నగర్‌లో జక్కుల శ్రీను ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది.

మర్రిపూడిలో..

మర్రిపూడి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఔన్నత్యం మరువలేనిదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని జి.అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒక ముఖ్యమంత్రి నిరుపేద ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ జరగదన్న వైసీపీ ప్రచారాన్ని తిప్పికొట్టామని చెప్పారు. అగ్రహారంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దర్శి మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, ఎంపీడీవో ఎన్.సుదీపా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, పొదిలి జడ్పీటీసీ మాజీ సభ్యులు కాటూరి పెదబాబు, మాజీ సర్పంచ్‌లు వి.వెంకయ్య, ఎం.వెంకటనారాయణ, నాయకులు ఎం.బాలకోటయ్య, బి.కిష్టయ్య, రేగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామగ్రామానా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. చంద్రబాబు చిత్రపటానికి అవ్వాతాతలు పాలభిషేకం చేశారు.

వాడవాడలా పింఛన్ల పండుగ

కొండపి : పింఛన్‌ల పంపిణీ నియోజకవర్గంలో వాడవాడలా పండుగలా సాగింది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు ఆయా గ్రామాల పార్టీ నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎంపీడీవోలు పర్యవేక్షించారు. పొన్నలూరు మండలంలోని నాగిరెడ్డిపాలెం, జరుగుమల్లి మండలం చతుకుపాడు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. అనంతరం కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో లబ్ధిదారులకు సత్య నగదును అందజేశారు. ఆయన వెంట కొండపి మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్ ఉన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ పొన్నలూరు మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చతుకుపాడులో జరిగిన కార్యక్రమానికి జరుగుమల్లి పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు తదితరులు హాజరయ్యారు.

కొండపి మండలంలో..

పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ముమ్మరంగా జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. వెన్నూరులో పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి పింఛన్ డబ్బులు ఇచ్చారు. ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు పింఛన్‌లు పంపిణీ చేశారు. పెరిదేపి గ్రామంలో పార్టీ నాయకులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, రావిపాటి వెంకటరావు, మిట్టపాలెంలో పార్టీ నాయకులు వీరాస్వామి, సుధాకర్, ధర్నాశి వసంతరావు పాల్గొన్నారు. ముప్పవరంలో పార్టీ సీనియర్ నాయకుడు బత్తుల నారాయణస్వామి అందజేశారు. కట్టుబడివారిపాలెంలో పార్టీ నాయకులు దామా మురళి, శ్రీహరి, కె. మహేంద్ర పాల్గొన్నారు. కె.ఉప్పలపాడులో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, టీడీపీ నాయకుడు గుండపనేని రామ్మూర్తి నాయుడు తదితరుల ఆధ్వర్యంలో పింఛన్‌ల పంపిణీ జరిగింది. చోడవరంలో పార్టీ నాయకులు రావిపాటి బాలకృష్ణ, కొమ్మాలపాటి రాఘవరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. చినవెంకన్నపాలెంలో మాజీ సర్పంచ్ పోటు శ్రీనివాసరావు పాల్గొని పింఛన్ డబ్బులు అందజేశారు. కొండపిలో తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజాషా, తెలుగు యువత ఒంగోలు పార్లమెంటు కార్యదర్శి దేపూరి హాజరై పింఛన్‌లను పంపిణీ చేశారు. తాటాకులపాలెంలో తెలుగు రైతు నాయకుడు చాగంరెడ్డి నరసారెడ్డి, నెన్నూరుపాడులో రైతు నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, పెట్లూరు గ్రామంలో ఉపసర్పంచ్ మూలె రామారావు, నాయకులు మూలె కోటేశ్వరరావు, కందిమళ్ల లక్ష్మీనారాయణ, బొల్లినేని నరసింహం తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సామాజిక భద్రత పింఛన్‌ను ఒక్కో లబ్ధిదారుడికి రూ.4వేలు కూటమి ప్రభుత్వం అందజేస్తున్నదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్య అన్నారు. మండలంలోని మూలగుంటపాడు, సింగరాయకొండల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షుడు రాజేష్, నేతలు చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, నేలపాటి శంకర్, సన్నెబోయిన మల్లికార్జున, వర్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. బింగినపల్లి కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బాలాజీ పాల్గొని పింఛన్‌లు పంపిణీ చేశారు. సోమరాజుపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగరాయకొండలో నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, సంధానీబాషా, చీమకుర్తి కృష్ణ, రామారావు, చంటి పాల్గొన్నారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎస్‌డీసీ విజిలెన్స్ ప్రత్యేకాధికారి ఎ.కుమార్ పరిశీలించారు.

కొండపిలో 90శాతం పింఛన్‌ల పంపిణీ

కొండపి, జూలై 1 : కొండపి నియోజకవర్గంలో తొలిరోజే దాదాపు 90శాతం మందికి పింఛన్‌లు పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు నియోజవర్గంలోని ఆరు మండలాల్లో పింఛన్ నగదు పంపిణీ వివరాలను ఎన్టీఆర్ భరోసా నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎ.కుమార్ వెల్లడించారు. ఆ ప్రకారం మర్రిపూడి మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 5,594 మంది పింఛన్‌దారులుండగా 5,204 (93.06శాతం) మందికి సొమ్మును అందజేశారు. జరుగుమల్లి మండలంలో 15 గ్రామ సచివాలయాల పరిధిలో 6,449 మంది లబ్ధిదారులుండగా తొలిరోజు 6,190 (95.98శాతం) మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. పొన్నలూరు మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో 6,219 మంది ఉండగా 5,612 (90.41శాతం) మందికి అందజేశారు. కొండపి మండలంలో 14 సచివాలయాల పరిధిలో 6,366 మంది లబ్ధిదారులుండగా 5,668 (89.19శాతం) మందికి పంపిణీ చేశారు. టంగుటూరు మండలంలో 9,555 మంది లబ్ధిదారులుండగా తొలిరోజు 8,058 (84.35శాతం) మందికి పింఛన్ సొమ్ము ఇచ్చారు. సింగరాయకొండ మండలంలోని 15 సచివాలయాల పరిధిలో 9,246 మంది లబ్ధిదారులుండగా 7,828 (84.66 శాతం) మందికి పింఛన్ అందింది. వలసదారులు, వైద్యశాలల్లో ఉన్నవారికి మినహా గ్రామాల్లో అందుబాటులో ఉన్నవారందరికీ పింఛన్ సొమ్మును అందజేశామని కుమార్ తెలిపారు. మంగళవారం మిగిలిపోయిన వారికి కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.

మీకోసం అర్జీలను పరిష్కరించాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1: జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం మీ కోసం అర్జీలను స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా ఆయా అర్జీలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారం కోసం తగిన చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

- ప్రత్యామ్నాయం చూపకుండా కనిగిరిలో వీధివ్యాపారుల దుకాణాలను తొలగిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జివికొండారెడ్డి తెలిపారు. చెప్పులబజారు, ప్రధానవీధుల్లో 250మందికిపైగా వీధి వ్యాపారులు మున్సిపాల్టీకి ఆక్రమణ పన్ను చెల్లిస్తూ విద్యుత్ శాఖ ద్వారా మీటర్లు కూడా పొంది అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగింపులను ఏకపక్షంగా చేస్తున్నారని తెలిపారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

-డీఎస్సీ-24 నోటిఫికేషన్‌లో ఉర్దూ ఎస్‌జీటీ పోస్టులు, ఉర్దూ (ఎస్ఏ) పోస్టులను చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు కోరారు. ప్రభుత్వం ఈనెల 12న జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉర్దూ మాధ్యమంలో జిల్లాలో పోస్టులు చూపలేదని, వాటిని చూపించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

- జిల్లాలో వాటర్ స్కీంలలో పనిచేస్తున్న వాల్ ఆపరేటర్లు, పంపు మెకానిక్, ఎలక్ట్రీషియన్స్, పంపు ఆపరేటర్లు, ఫిట్టర్లను ఆదుకోవాలని ఏపీఆర్‌డబ్ల్యూఎస్‌అండ్‌ఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.మల్లికార్జున, కోటయ్య కోరారు. గత 25ఏళ్లుగా మంచినీటి పథకల్లో పనిచేస్తున్నామని తెలిపారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టు విధానంతో నష్టపోతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం సమస్యలను విన్నవించారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

దర్శి, జూలై 1: దర్శి పట్టణంలో సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. ఉదయం 8 గంటల సమయంలో నేరుగా దర్శి పట్టణంలోని శివాలయం వీధికి వచ్చారు. సచివాలయ సిబ్బంది అక్కడ పంపిణీ చేస్తున్న పింఛన్లను పరిశీలించారు. అప్పటివరకు జరిగిన పంపిణీపై ఆన్‌లైన్‌లో తనిఖీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నారా, లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రంలోపు 99 శాతం పూర్తి చేయాలన్నారు. సాంకేతిక కారణాలవల్ల ఎక్కడైనా నిలచిపోతే మంగళవారం పూర్తిచేసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యవైఖరి అవలంబించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ సుజాత, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

తాళ్లూరు, జూలై 1: మండలంలోని విఠలాపురం, శివరాంపురం గ్రామ పంచాయతీల్లో సోమవారం అధికార టీడీపీ నేతలను పిలవకుండా సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీని ప్రజాప్రతినిధులతో చేయించాలని, ప్రయివేట్ వ్యక్తులతో చేయిస్తే లీగల్ చర్యలు తీసుకుంటానని ఎంపీడీవోకు విఠలాపురం వైసీపీకి చెందిన సర్పంచ్ వాట్సాప్ మెసేజ్ పెట్టారు. సదరు మెసేజ్‌ను ఎంపీడీవో ఆగ్రామ సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. ఈవిషయమై సచివాలయ సిబ్బంది అధికారిని అడుగగా టీడీపీ నాయకులను పిలువకుండా మీరే పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆగ్రామ సచివాలయ సిబ్బంది అధికార టీడీపీ నేతలకు సమాచారం ఇవ్వకుండా పెన్షన్లు పంపిణీ చేయటంతో మండల స్థాయి టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివరాంపురం గ్రామంలో కూడా సచివాలయ సిబ్బంది తమ ఇష్టానుసారం అధికార టీడీపీ నేతలను లెక్కచేయక పెన్షన్లు పంపిణీ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పెన్షన్ నగదు పెంచి కూటమి నేతలను పిలిచి పండుగవాతావరణంలో పంపిణీ చేయాలని సూచించగా విఠలాపురం వైసీపీ సర్పంచ్ చెప్పినట్లు టీడీపీ నేతలను ఎందుకు పిలవలేదని ఎంపీపీ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు నిలదీశారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో విఠలాపురం, శివరాంపురం గ్రామసచివాలయాల సిబ్బందితో మాట్లాడారు. ఎందుకు ఇలా చేశారని ప్రశ్నించారు. విఠలాపురం సర్పంచ్ పెట్టిన మెసేజ్ గురించి వివరించగా పెన్షన్ల పంపిణీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగానే పంపిణీ చేయాలని ఎక్కడాలేదని, ఆ గ్రామానికి ఎంపీటీసీగా, అధికారపార్టీ ఎంపీపీగా ఉన్న తన దృష్టికి ఎందుకు తీసుక రాలేదని ప్రశ్నించటంతో వాళ్లు నీళ్లు నమిలారు. తాము ఎంపీడీవోకు చెప్పగా సర్పంచ్ అలాంటి మెసేజ్ పెట్టాడని, మీరే ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారన్నారు. ప్రభుత్వం చెప్పిన పనులు చేయటం ఉద్యోగుల బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు.

ఎంపీడీవో మృతి



చినగంజాం, జూలై 1 : చినగంజాం ఎంపీడీవో వరప్రసాద్ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గత నెల 27వ తేదీ రాత్రి 9గంటలకు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై విజయవాడలోని ఆంధ్ర హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటర్ వైద్యశాలలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఫిబ్రవరి 1, 2024 నుంచి చినగంజాం ఎంపీడీవో పనిచేస్తున్నారు. ఆయన మృతితో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే సాంబశివరావు సంతాపం తెలిపారు.

రెండు ఆటోలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు

బల్లికురవ, జూలై 1 : మల్లాయపాలెం బస్టాప్ సమీపంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఇద్దరినీ చిలకలూరిపేటకు తరలించారు. ఒక డ్రైవర్ గణేష్‌గా గుర్తించారు.





గిద్దలూరులోని ఏబీఎం పాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న అశోక్‌రెడ్డి, చాపలమడుగులో పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు, మార్కాపురంలో నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ఊరువాడ పింఛన్ల పండుగ

- మాట నిలుపుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- పెంచిన పింఛన్ల అందజేత
- అవ్వాతాతల కళ్లలో ఆనదం

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పండగ సోమవారం నిర్వహించారు. పశ్చిమ ప్రకాశంలోనూ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అధికారులు పింఛన్లను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు ఇళ్లకు వెళ్లి ఎన్‌టీఆర్ భరోసా సొమ్ము అవ్వాతాతలకు అందజేసి వారికి ఇచ్చిన మాట నిలుపుకున్నారు.

గిద్దలూరుటౌన్, జూలై 1 : ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఫించన్లను పెంచి అందించినట్లు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఏబీఎం పాలెంలోని 2వ సచివాలయం పరిధిలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఫించన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి వెయ్యి చొప్పున, పెరిగిన ఫించన్ రూ.4వేలతో కలిపి మొత్తం రూ.7వేలు అందజేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు 1500, సంవత్సరానికి ఉచితంగా 3 సిలిండర్లు, తల్లికివందనం కింద ప్రతి తల్లికి 15వేలు అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పింఛన్ల పంపిణీ ప్రత్యేక అధికారి డి.నాగజ్యోతి మున్సిపల్ కమిషనర్ యు.శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, కౌన్సిలర్ పాలుగుళ్ల శ్రీదేవి, బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ.నారాయణ, కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, లొక్కు రమేష్, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, జాఫర్, బిల్లా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఫించన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి ఫించన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో టీడీపీ నాయకులు ఫించన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 2వ వార్డులో కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, 3వ వార్డులో పాలుగుళ్ల శ్రీదేవి, 5వ వార్డులో పరుచూరి సుభాషిణి, 6వ వార్డులో గర్రె సుజాత, 7వ వార్డులో బిల్లా జయలక్ష్మి, 8వ వార్డులో గడ్డం భాస్కర్‌రెడ్డి, 9వ వార్డులో పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, 11వ వార్డులో కౌన్సిలర్ లొక్కు రమేష్, 15వ వార్డులో చౌడేశ్వరి, 16వ వార్డులో టీడీపీ నాయకులు పాముల వెంకటరమణ, 17వ వార్డులో బాలరాజు, 18వ వార్డులో బొంతా లక్ష్మీదేవి ఫించన్లు పంపిణీ చేశారు. మండలంలోని సంజీవరాయునిపేటలో జడ్పీటీసీ సభ్యులు బుడత మధుసూదన్, ఉయ్యాలవాడలో మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపాలకృష్ణ, తాళ్లపల్లిలో మార్తాల సుబ్బారెడ్డి, ముండ్లపాడులో కడియం శేషగిరి, కెఎస్‌పల్లిలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, వెల్లుపల్లెలో గర్రె శ్రీనాథ్ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో అధికారులు పాల్గొన్నారు.

కొమరోలు, : స్థానిక ఇస్లాంపేట, బస్టాండు సమీపంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి పాల్గొని పెంచిన పింఛన్లను అందజేశారు. ఇంటికే వచ్చి సచివాలయ ఉద్యోగుల ద్వారా నూరుశాతం పంపిణీ చేస్తామన్నారు. ఒకేసారి వేయ్యి రూపాయలు పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. అంతకు ముందు కొమరోలులోని బస్టాండులో మామిడి తోరణాలు కట్టి, అరటిచెట్ల వాతావరణంలో పింఛన్లును ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ కరపత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఎస్సై మదుసుదన్‌రావు, కార్యాదర్శిలు సురేష్, శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు గజ్జలకొండ నారాయణ, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖాదర్, సొసైటీ మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, మాజీ సైనికుల అధ్యక్షులు అంబారపు రామకృష్ణారెడ్డి నాయకులు పెనుగొండ రమణ, అంబారపు సుబ్రహ్మణ్యం, తుమ్మలపెంట రమణ, ఖాజావలి, వీరనారాయణరెడ్డి, గుర్రం క్రిష్ణబాబు, బాలరంగయ్య పాల్గొన్నారు.

గిద్దలూరు : రాచర్లలోని బీసీ కాలనీలో ఎన్‌టీఆర్ భరోసా ఫించన్లను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ అధ్యక్షులు యోగానంద్, జనసేన పార్టీ ఇన్‌చార్జి సాయిబాబు, టీడీపీ, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్తవారపేటలోని బీసీ కాలనీలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి లబ్ధిదారులకు ఫించన్లను పంపిణీ చేశారు. గిద్దలూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, వివిధ పార్టీల నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, డాక్టర్ జె.వి.నారాయణ పాల్గొన్నారు.

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 6గంటల నుంచే పండుగ వాతావరణంలో ఎన్‌టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అర్థవీడు మండలం నాగులవరంలో, కంభం పట్టణంలోని కోనేటివీధి, సాదుమియా వీధుల్లో పెంచిన ఫించన్ల, బకాయి కలిపి ఫించన్‌దారులకు రూ.7వేలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లెం శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి పాల్గొన్నారు. ఆయా చోట్ల ఆయా పంచాయతీల టీడీపీ నాయకులు, మండలపార్టీ అధ్యక్ష కార్యదర్శులు తోట వెంకట శ్రీనివాసులు, ఆరేపల్లి మల్లికార్జున్, కేతం శ్రీనివాసులు, గోన చెన్నకేశవులు, కొత్తపల్లి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రవికుమార్, రాజభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న ప్రభుత్వం : నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్ : రాష్ట్రంలో పెన్షన్ లబ్ధిదారులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం మాట నిలబెట్టుకున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల వారికి అండగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ అధికారి బీపీఎస్ సాయికుమార్, ఎంపీడీవో తోట చందన, టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజులరెడ్డి, నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, ముదిరెడ్డి అశోక్‌రెడ్డి, నల్లారెడ్డి కృష్ణారెడ్డి, గుమ్మ నాగార్జున, జనసేన బీజేపీ నాయకులు మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం మండలంలోని చింతగుంట్ల గ్రామంలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా పరిశీలించారు.

పొదిలి : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో పండుగలా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితోపాటు మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నగరపంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, మాజీ సర్పంచ్‌లు కాటూరి చినబాబు, డాక్టర్ స్వర్ణగీత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎన్‌ఎస్‌ఎఫ్ వరికుంట్ల అనీల్, మాజీ ఎంపీటీసీ గునుపూడి మాధవి, సయ్యద్ ఇమాంమ్‌సా, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, కాటూరి శ్రీనివాసులు, షాహీద్, బుచ్చిబాబు, బొడ్డుసుబ్బయ్య, ఈగలపాడు సర్పంచ్ సుబ్బులు దంపతులు, కుంచేపల్లి సర్పంచ్ వరికుంట్ల కాంతమ్మ, మాజీ ఉపసర్పంచ్ జిలాని, నాయకులు కోకా చిన్నిక్రిష్ణ, దివ్వెల మురళీ, రాజా, గోగినేని వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

మార్కాపురం : ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మార్కాపురం డివిజన్‌లో పండుగలా జరిగింది. ఉదయం 5.30 గంటల నుంచే అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పెంచిన పింఛన్‌ను పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, విక లాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధుల లబ్ధిదారుల తోపాటు సుమారు 26 విభాగాలకు చెందిన వారికి సోమవారం ఒక్కరోజే మార్కాపురం డివిజన్‌లో 95 శాతం మేర పింఛన్‌లను పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ కార్యక్రమా లను టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, జనసేన నాయకులు ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, కార్యకర్తలు పర్యవేక్షించారు.

వాగ్దానం నెరవేర్చాం : కందుల

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 7, 30వ వార్డుల పరిధిలో సోమవారం వేకువజామున ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రతిచోట రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పేదలు లేని సమాజం సృష్టించడమే ఆయన లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, కనిగిరి బాలవెంకట రమణ, చక్కా మధు, గులాబ్, పఠాన్ హుసేన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : ఇంటివద్దకే సచివాలయ సిబ్బందితో కలిసివచ్చి టీడీపీ నాయకులు సోమవారం పింఛన్‌లు పంపిణీ చేశారు. తొలిరోజు 96 శాతం పంపిణీ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తాతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, నాయకులు సాని కొమ్ము వెంకటేశ్వరెడ్డి, ఆయాగ్రామాల టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లలచెరువు : టీడీపీ ప్రభుత్వం పేదలకు అపన్న హస్తం అందిస్తుందని టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. సోమవారం చాపలమడుగులో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై కూడా ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విలియమ్స్, తహసీల్దారు శ్రీనివాసరావు, వెలుగు ఏసీ లక్ష్మిరెడ్డి, ఏపీఎం నూనె వెంకటయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, చాపలమడుగు ఆవుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : భారత దేశ చరిత్రలో పింఛన్ల పంపిణీ ఓ మైలురాయి అని టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ఉదయం 6 గంటలకే ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జమ్మిదోర్నాల గ్రామంలో ఆయన పాల్గొన్నారు. త్వరలోనే మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించనున్నట్లు, కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే వెలిగొండ ప్రాజెక్టు పనులపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేసిన గత ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేను నాగేంద్రబాబు, చంటి, షేక్ సమ్మద్ భాష, కే సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, షేక్ ఇస్మాయిల్, షేక్ బాష, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చంచయ్య, ఐనేని నాగ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : ఎన్నికల ముందు ఇచ్చిన పింఛన్ల పెంపు హామీతో పెరిగిన పింఛన్లను పంపిణీ చేసే కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలో సాగింది. ఉదయం 6 గంటలకే సచివాలయ సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు గ్రామాలలోని వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు ఇతర లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. దీనిలో భాగంగా దూపాడులో టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, నాసరరెడ్డి, సర్పంచ్ అనూష, త్రిపురాంతకంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, ముడివేములలో దేవినేని చలమయ్య, మేడపిలో అచ్చయ్య, సునీల్, కోటేశ్వరరావు, మిట్టపాలెంలో ఊట్ల వెంకటేశ్వర్లు, రామసముద్రంలో అల్లూరిరెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, చిట్యాల వెంగలరెడ్డి, శనగా నారాయణరెడ్డి, గోళ్ల సుబ్బారావు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, తోట మహేష్, కంచర్ల సత్యనారాయణగౌడ్, ఒంగోలు ఆదిరెడ్డి, షేక్ ఇస్మాయిల్, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, అచ్యుతరావు, చేదూరి కిషోర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : మండలంలో 8411 మంది ఎన్టీఆర్ భరోసా ఫించను లబ్ధిదారులుండగా, 7590 మందికి ఫించన్లు పంపిణీ చేసి 90.24 శాతం నమోదు చేసినట్లు ఎంపీడీవో వై నాగేశ్వరప్రసాదు సోమవారం సాయంత్రం తెలిపారు.



పీర్లచావిడి వద్ద పింఛన్ల పంపిణీ

పింఛన్ల పంపిణీలో మారని తీరు

గిద్దలూరు, జూలై 1 : రాష్ట్రంలో. ఇంటింటికి వెళ్లి పింఛన్‌లు అందించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ, చాలా ప్రాంతాలలో సచివాలయ సిబ్బంది ఆదేశాలను తుంగలోకి తొక్కి తాము ఉన్న చోటికే లబ్ధిదారులను పిలిపించు కున్నారు. ముండ్లపాడులో పీర్లచావిడి వద్దకు వృద్ధులను, వికలాంగులను ,వితంతువులను పిలిపించుకుని సచివాలయ ఉద్యోగి ఫించన్లను పంపిణీ చేశాడు. ఎన్.బయనపల్లెలో సైతం, అలాగే పొదలకొండపల్లిలో కూడా సచివాలయ సిబ్బంది ఒక సెంటర్‌లో ఉండి ఫించన్లను అక్కడకు వచ్చిన వారికి అందజేశారు.






బేస్తవారపేటలో సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటానికి పాలాభిషేకం, కొమరోలులో పింఛన్ పంపిణీ, త్రిపురాంతకంలో పింఛన్ల పంపిణీ, చింతలగుంటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మీకోసం అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

మార్కాపురం, జూలై 1: మీ కోసంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్క రించాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా మీకోసం కార్య క్రమం నిర్వహించారు. మీ కోసం కార్యక్రమంలో మొత్తం 24 అర్జీలు రాగా అందులో 22 అర్జీలు భూ సంబంధిత అంశాలకు సంబంధించినవి కావడం విశేషం. మార్కాపురం పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు బ్యాక్‌లాగ్ పోస్టుల కింద ఉద్యోగం ఇప్పించా లని కోరారు. కార్యక్రమంలో డివిజన్‌లోని ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు

డీడీఏ రామ్మోహన్ హెచ్చరిక

మార్కాపురం రూరల్, జూలై 1: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామ్మోహన్ హెచ్చరించారు. పట్టణంలోని విత్తనకేంద్రాలు, ఎరువుల దుకాణాలలో సోమవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గాయత్రి ట్రేడర్స్ దుకాణంలో ప్రభుత్వ నిబంధనల మేరకు, అమ్మకాలకు సంబంధించిన సరైన అనుమతి పత్రాలు పీసీ లేనందున రూ.3.16లక్షల విలువైన విత్తనాల విక్రయాలను, శ్రీహరి దుకాణంలో రూ.29750విలువైన అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. విత్తన, పురుగు మందుల కేంద్ర దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్న ఎరువుల, విత్తనాల, వివరాలను రేట్లను చూపించే, స్టాక్‌బోర్డు నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు. ప్రభుత్వ అనుమతి కలిగిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. విక్రయాల వివరాలను రికార్డులో పొందుపరిచి ఆ రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలలో మార్కాపురం ఏడీఏ డి.బాలాజీనాయక్, ఏవో దేవిరెడ్డి, శ్రీనివాసులు, బీటీఎం సురేఖ పాల్గొన్నారు.

టీచ్ టూల్‌పై శిక్షణ

గిద్దలూరు, జూలై 1 : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో టీచ్‌టూల్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోర్సు డైరెక్టర్ అయిన రాచర్ల మండల ఎంఈవో వి.గిరిధరశర్మ మాట్లాడుతూ టీచింగ్ ప్రైమరీ, టీచింగ్ సెకండరీ ఎగ్జామ్స్ శిక్షకులు ఉత్తీర్ణత చెందాలని, తద్వారా 5 మండలాల పరిధిలో 42 మంది టీచింగ్ అబ్జర్వర్లు తయారవుతారన్నారు. క్రమం తప్పక శిక్షణకు హాజరు కావాలని సూచించారు. మాస్టర్లు ట్రైనర్లుగా బత్తిని వెంకటేశ్వరగౌడ్, వీవీ.రమణ వ్యవహరించగా ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, వి.శివకోటేశ్వరరావు పాల్గొన్నారు. ఆరు మండలాల ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు.

ఖచ్చితమైన అంచనాలకు ప్రోత్సాహకాలు

విజేతలకు చెక్కులు అందజేత

మార్కాపురం, జూలై 1: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఏ స్థానంలో ఎవరు గెలుస్తారు అనే విషయంలో ఖచ్చితంగా అంచనా వేసిన వారిలో విజేతలకు 'ఆంధ్రజ్యోతి' ఒంగోలు యూనిట్ బ్రాంచి మేనేజర్ ఐ.వీ.సుబ్బారావు సోమవారం నగదు బహుమతి చెక్కులను అందజేశారు. 'రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరుతో 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కౌంటింగ్‌కు ముందు ప్రతిరోజూ కూపన్‌ను ప్రచురించారు. ఈ వినూత్న ప్రయోగానికి వేలాది మంది స్పందించారు. వారి వారి అంచనాలను అనుగుణంగా కూపన్లను త్రోవగుంటలోని 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ కూటమి 10 సీట్లు, వైసీపీ 2 అసెంబ్లీ సీట్లు గెలవడంతోపాటు ఏ స్థానంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడు అనే విషయంలో ఖచ్చితమైన అంచనా వేసిన వారి కూపన్ల నుంచి డ్రా తీసి విజేతలను నిర్ణయించారు. వీరిలో జిల్లా ప్రథమ బహుమతికి మార్కాపురం పట్టణానికి చెందిన ఎం.గుల్జాన్ ఎంపికయ్యారు. ద్వితీయ బహుమతిలో భాగంగా ముగ్గురుని ఎంపిక చేశారు. ఒకరు పెద్దారవీడు మండలం కొత్తపల్లికి చెందిన తిరుమలరెడ్డి లక్ష్మీదేవి, మరొకరు మార్కాపురం పట్టణానికి చెందిన బి.రాజేష్‌లు ఉన్నారు. రాష్ట్రస్థాయి లక్కీడిప్-2గా ఒంగోలుకు చెందిన ఏ.సాంబశివరావు ఎంపికయ్యాడు మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐ.వి.సుబ్బారావు ప్రథమ బహుమతి విజేత ఎం.గుల్జాన్‌కు రూ.10,000, ద్వితీయ బహుమతి విజేతలు టి.లక్ష్మీదేవి, బి.రాజేష్‌లకు రూ.5000ల చెక్కులను అందజేశారు. రాష్ట్రస్థాయి లక్కీడిప్‌లో గెలుపొందిన ఏ.సాంబశివరావుకు రూ.10,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్ వీవీ.రమణ. స్థానిక ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.





ఐవీ సుబ్బారావు చేతుల మీదగా చెక్కు అందుకుంటున్న విజేతలు

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగివుండాలి

మార్కాపురం, జూలై 1: పార్లమెంటులో రూపొందించిన నూతన క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని న్యాయవాది ఉషశ్రీ అన్నారు. స్థానిక సబ్ జైలులో సోమవారం నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం సబ్‌జైలు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది ఉషశ్రీ భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులు పి.రామచంద్ర, పారాలీగల్ వాలంటీర్లు ఆదినారాయణ, బాషా, మండల లీగల్ సర్వీస్ అథారిటీ, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాన్ని కాపాడాలి

కమిషనర్‌కు సీపీఎం నాయకుల వినతి

మార్కాపురం, జూలై 1: స్థానిక అన్నా క్యాంటీన్ పక్కనేవున్న సర్వే నెంబర్ 404/బి4 సర్వే నెంబర్‌లోని మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని సీపీఎం నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు గత ప్రభుత్వ హయాంలో వైసీపీ ముఖ్య నాయకుని అండతో సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేశారన్నారు. గతంలో ఆ స్థలాన్ని మార్కాపురం హౌసింగ్ క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ వాళ్లు మున్సిపల్ బెటర్మెంట్ అవసరాల కోసం కేటాయించినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలు జరిగినా మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య నాయకులు డీకేఎం రఫీ, గుమ్మా బాలనాగయ్య, పందీటి రూబెన్, కాశయ్య, విజయ్. నాగరాజు, పి.మల్లిఖార్జున్ తదితరులు ఉన్నారు.

అవీ..ఇవీ..

ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

గిద్దలూరు, జూలై 1 : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా సికింద్రాబాద్ వరకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును ఔరంగబాద్ వరకు పొడిగించారు. సోమవారం నుంచి పొడిగింపును రైల్వేశాఖ అమలులోకి తెచ్చింది. గుంటూరు నుంచి ఔరంగబాద్ వరకు వెళ్లే (17253) రైలు గుంటూరులో ఉదయం 7.15 గంటలకు బయలుదేరి 10.26 గంటలకు గిద్దలూరు, రాత్రి 10గంటలకు సికింద్రబాద్ చేరుకొని మరుసటి రోజు మధ్యాహ్నం 1.20 గంటలకు ఔరంగబాద్ చేరుకుంటుంది. ఇదే రైలు తిరుగుప్రయాణంలో (17254) ప్రతిరోజు సాయంత్రం 4.15 గంటలకు ఔరంగబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.15 గంటలకు సికింద్రబాద్‌కు, సాయంత్రం 4.09 గంటలకు గిద్దలూరుకు చేరుకొని రాత్రి 9.30 గంటలకు గుంటూరు చేరుతుంది.

రీసర్వేను రద్దు చేయాలి

- పాత పద్ధతిని కొనగించాలని రైతుల వినతి



పుల్లలచెరువులో డీటీ కిరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పుల్లలచెరువు, జూలై 1: వైసీపీ ప్రభుత్వం జగనన్న భూరక్ష పథకం కింద తీసుకొచ్చిన భూముల రీసర్వేతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే భూ రీసర్వేను రద్దు చేయాలని పుల్లలచెరువు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని చౌటపల్లిలోని 102 సర్వేనంబర్ల పట్టా భూములను ఇనాం భూములుగా మార్చారని అన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్‌పీ నెంబర్లతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రీ సర్వే తరువాత భూముల కొలతలు మారి రైతుల భూములు తప్పుగా ఉన్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి రీసర్వేను రద్దు చేసి పాత విధానంలో భూముల ఆన్‌లైన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రాణదాత డాక్టర్ మన్నే రవీంద్ర



డాక్టర్ రవీంద్రను సన్మానిస్తున్న పట్టణవాసులు

ఎర్రగొండపాలెం, జూలై 1: వెనుకబడిన ఎర్రగొండపాలెం ప్రాంతంలో 50 సంవత్సరాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ, వైద్య వృత్తికే గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖవైద్యులు, డాక్టరు మన్నెరవీంద్ర అని విద్యా కమిటి మాజీ చైర్మన్ గోళ్ల వీరవెంకట సుబ్బారావు అన్నారు. డాక్టరు డే సందర్భంగా సోమవారం ఎర్రగొండపాలెంలో డాక్టరు మన్నె రవీంద్రను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. డాక్టరు రవీంద్ర ఈ ప్రాంతంలో పేదప్రజలకు వైద్య సేవలు అందించి ఎందరికో ప్రాణాలు కాపాడిన గొప్ప వైద్యుడన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పి.లక్ష్మినారాయణ, పీఎల్‌టీయూ మండల కమిటీ అధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్లు సన్మానం

డాక్టర్సు డే సందర్భంగా రవీంద్ర సూపర్ స్పెషాలిటి వైద్యశాలలో డాక్టరు రవీంద్రను జూనియర్ డాక్టర్లు సన్మానించారు. డాక్టరు లక్ష్మినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రవీంద్రకు సన్మానం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న వైద్యులు

గిద్దలూరు టౌన్, జూలై 1 : జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, ఆర్ఎంవో డాక్టర్ రమణరెడ్డి, వైద్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆయేషా, డాక్టర్ కాదరయ్యతోపాటు 30 మంది రక్తదానం చేశారు. డాక్టర్ సూరిబాబు మాట్లాడుతూ దేశంలో ప్రతి 2 సెకన్లకు ఒకరికి రక్తం అవసరమవుతుందన్నారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలు కాపాడుతుందన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

డాక్టర్స్ డే సందర్భంగా పలువురు వైద్యులను ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. విధులు నిర్వహిస్తున్న ఆయా వైద్యులు సూరిబాబు, సుధాకర్, ప్రవీణ్, శివకుమార్‌రెడ్డి, రమణరెడ్డి, ఆదామ్, హరినాథరెడ్డి, శివారెడ్డి, భూమా బాలనరసింహారెడ్డి, జేవీ.నారాయణ, రామరంగస్వామిలను శాలువలతో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాన్ని అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో చిన్ని సేవా సంస్థ అధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం

అరుణోదయ పబ్లిక్ స్కూలులో చదివి వైద్యులుగా సేవలు అందిస్తున్న పూర్వ విద్యార్థులను సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఎం.విజయభాస్కర్, డాక్టర్ జి.రమేష్‌బాబు, డాక్టర్ బి.కిరణ్‌కుమార్‌లను పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సాధారణ కుటుంబాలకు చెందిన వీరు పట్టుదలతో వైద్యవిద్యను అభ్యసించిన వీరిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కరస్పాండెంట్ చంద్రశేఖర్ అన్నారు.

వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- మంత్రికి బీజేవైఎం నాయకుల వినతి

మార్కాపురం, జూలై 1: ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేవైఎం ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జీవీరెడ్డి కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా జిల్లాలోని వైద్యశాలల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను మంత్రి సత్యకుమార్‌కు వివరించారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో వైద్య సదుపాయాలను మెరుగుపర్చాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలను తీర్చిదిద్దనున్నట్లు మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారని జీవీ రెడ్డి తెలిపారు. అంతేకాక అవినీతి అక్రమాలపై కూడా విచారణ చేయించాలని కోరారు.

రేషన్ బియ్యం దందాపై విచారిస్తున్నాం..!

- రాజీనామా చేసిన డీలర్లపై కూడా 6ఏ కేసులు
- జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయ్ భాస్కర్

పుల్లలచెరువు, జూలై 1: ఎర్రగొండపాలెం కేంద్రంగా అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్క డీలరును కుడా వదిలే ప్రసక్తిలేదని జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయ్ భాస్కర్ సోమవారం తెలిపారు. రేషన్ నయాదందాపై జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తక్షణమే విచారణ చేయిస్తున్నామని అన్నారు.రాజీనామా చేసిన డీలర్లపైకుడా 6ఏ కేసులు నమోదు చేస్తామని అన్నారు.రేషన్ బియ్యం ఒక్క షాపులో భారీగా అక్రమాలు జరిగాయని 6ఏ కేసులు నమోదు చేసి సరుకులు తేల్చేందుకు వైపాలెంకు మరో ఇద్దరు ఎన్‌ఫోర్సుమెంటు డీటీలను కేటాయించామని తెలిపారు.48 గంటల్లో విచారణ పూర్తి చేసి జిల్లా అధికారులకు అందజేస్తామని అన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్



మాట్లాడుతున్న మంత్రి స్వామి

దర్శి, జూలై 1: సంక్షేమ పథకాల అమలుకు ఎన్టీఆర్ ఆద్యుడని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం దర్శి మండలం రాజంపల్లిలో పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ రూ.30లతో వృద్ధులకు, వితంతువులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు 2014లో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలకు పెంచి అమలు చేశారన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం రూ.4వేలకు పెంచి అందజేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు సంపదను సృష్టించటం కొత్తకాదన్నారు. 2014లో రాష్ట్రం విడిపోయి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారన్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే సమర్థత చంద్రబాబుకే ఉందన్న నమ్మకంతో ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీన్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు, మాజీ ఎంపీపీ పి.వెంకట్రామయ్య, కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీమతి వసుంధర, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తహసీల్దార్ జి.సుజాత, ఎంపీడీవో హనుమంతరావులు పాల్గొన్నారు.

పెన్షన్ పెరిగింది.. ఇంటికి చేరింది

పీసీపల్లి, జూలై 1: ఎన్నికల ముందు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు పెంచుతానని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా అమలు చేశారన్నారు. ఇచ్చినమాట ప్రకారం జూలై 1న లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు సంతోషం వ్యక్తం చేశారు.



పేదలకు బాబే పెద్దదిక్కు

- గోనుగుంట్ల ఆదిలక్ష్మమ్మ

పెన్షన్ సొమ్మే నాకు ఆధారం. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడంతో పాటు ఓట్లకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ బకాయిలకు కలిపి రూ.ఏడు వేలు ఇంటివద్దే చంద్రబాబు ఇప్పించాడు. మాలాంటి పేదలకు ఇది ఎంతో ఆదరువుగా ఉంటుంది.



హామీని అమలుపరిచారు

- చెన్నయ్య

మార్పు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని నమ్మకం ఉన్నందువల్లే ఎన్నికల్లో ఆయనకు మద్దతు పలికాం. జూలైలో రూ.ఏడు వేలు ఇస్తానని చెప్పిన ఆయన మాటప్రకారం ఒకటో తేదీనే ఇంటివద్దనే పెన్షన్ ఇచ్చి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చారు. చంద్రబాబే పేదలకు పెద్దదిక్కు. ఆయన నిండునూరేళ్ల చల్లగా ఉండాలి.

మొక్కు తీర్చుకునేందుకు తిరుమల బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు

దర్శి, జూలై 1: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కాలినడకన తిరుమల వచ్చి మొక్కు తీర్చుకుంటామని తూర్పుచౌటపాలెంకు చెందిన కార్యకర్తలు మొక్కుకున్నారు. ఈక్రమంలో మేడం రామిరెడ్డి, జడ్డా సత్యం, బొల్లినేని సత్యం, సోమవారం కాలినడకన తిరుమల బయలుదేరారు. వెంకటేశ్వరస్వామికి మొక్కు తీర్చుకునేందుకు తిరుమల వెళ్తున్నట్లు చెప్పారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

పామూరు, జూలై 1: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మ జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మ ఇస్తారని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వి207ఏ జిల్లా గవర్నర్ మంచికంటి రమేష్ అన్నారు. అనంతరం డాక్టర్ గద్దె ఏడుకొండలు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఈసీ మెంబర్ కోటా సురేష్, ఐపీసీ మెంబర్ ఇమ్మడిశెట్టి సుజాత, కపుల్ క్లబ్ అధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాసులు, వనితా క్లబ్ అధ్యక్షురాలు వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, జూలై 1: వైద్యులు దేవుడితో సమానమని వారిని సన్మానించడం దేవుడిని పూజించినట్లేనని లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీ రమణారావు అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ప్రవీణ్, రవితేజలను లయన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం కురిచేడులో ప్రముఖ వైద్యులు షేక్ సునీల్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ జేబీ రామారావు, యెలిసెట్టి రంగనాయకులు, గ్రంధిశిల నాగరాజు, లక్ష్మీనారాయణ, పెండ్యేల ప్రసాదరావు, ఇందూరి నరిసిరెడ్డి, కొత్తా అయ్యప్పసెట్టి పాల్గొన్నారు.

ముండ్లమూరు: డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ఆదివారం సాయంత్రం తన నివాసంలో టీడీపీ ముండ్లమూరు మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, కట్టా చిన వెంకం బొట్లు, కర్నాటి సాయి కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలని ఫుట్‌పాత్ వ్యాపారుల ఆందోళన


ఎక్స్‌కవేటర్‌కు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఫుట్‌పాత్ వ్యాపారులు

కనిగిరి, జూలై 1: పట్టణంలోని చెప్పుల బజారులో ఉన్న రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌పై ఉన్న బంకులను తొలగించేందుకు సోమవారం మున్సిపల్ అధికారులు ఉపక్రమించారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ వ్యాపారులు ఆందోళనకు దిగి రాస్తారోకో, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బంకులను తొలగించకుండా ఎక్స్‌కవేటర్‌లకు అడ్డంగా కూర్చున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ వీధి వ్యాపారులకు చట్టం ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా బంకులు తొలగించటం అన్యాయమన్నారు. బంకులు తొలగింపు నిర్ణయం ఉపసంహరించుకోక పోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఫుట్‌పాత్ వ్యాపారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కొళాయితో రక్షిత నీటిని అందిస్తాం

దర్శి, జూలై 1: దర్శి నియోజకవర్గ ప్రజలకు ఇంటింటి కొళాయి పథకం ద్వారా రక్షిత మంచినీటిని అందించేందుకు కృషి చేస్తామని టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. పట్టణంలోని కురిచేడు రోడ్డులో ఎన్టీఆర్ సుజల పథకాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నా రపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కురిచేడు, జూలై 1: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. అతిసార వ్యాధి ప్రబలకుండా, పసి పిల్లలకు వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

తాళ్లూరు, జూలై 1: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పెన్షన్‌దారులు సంతోషంగా ఉన్నారన్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, షేక్ కాలేషావలి, వేణుబాబు, లక్ష్మీనారాయణ, తిరుపతిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

తాళ్లూరు, జూలై 1: మండలంలోని శివరాంపురం ప్రాథమిక, జనరల్ పాఠశాల విద్యార్థులకు కావలికి చెందిన గునుపూడి పవన్‌కుమార్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి గునుపూడి భాస్కర్‌లు రూ10వేల విలువగల నోట్ బుక్స్ సోమవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం త్రిపురారి బొట్ల శ్రీనివాస్ విద్యార్థులకు కావల్సిన నోట్‌బుక్స్, పలకలు, తదితర సామగ్రిని కొనుగోలుచేశారు. వీటిని ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లలో ఆనందం

» ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం

» మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

దర్శి, జూలై 1: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తున్నామని, అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. దర్శి మండలం రాజంపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ తమీన్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలిసి వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం పింఛన్‌ను రూ.2 వేలు నుంచి రూ.3 వేలు పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం నెలరోజుల్లోపే పెంచిన రూ.వెయ్యితోపాటు మూడు నెలల బకాయి కలిపి మొత్తం రూ.7వేలు చొప్పున పింఛన్లు అందిస్తున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్లు తీసుకున్న సమయంలో వారి కళ్లల్లో ఆనందం చూసి ఎంతో తృప్తి కలుగుతుందన్నారు.

కలెక్టర్ తమీన్ అన్సారియా మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలో 92,999 మందికి పెంచిన పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 6 గంటలకే పింఛన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని, సాయంత్రం లోపు పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. సాంకేతిక కారణాలవల్ల ఎక్కడైనా మిగిలిన పింఛన్లను మంగళవారం పూర్తి చేస్తామన్నారు. అర్హులైన అందరికీ నగదు అందిస్తున్నామని ఆమె వివరించారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం

దర్శి, జూలై 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం సందర్భంగా సోమవారం రాజంపల్లిలో గ్రామ పెద్దలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నాలుగు వేలకు పెంచిన పింఛన్‌తో పాటు బకాయి రూ.3వేలు కలిపి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు, గ్రామస్థులు ఆనందంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి, దామా కృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, జూలై 1: మండలంలో సోమవారం 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సీతారామయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద టీడీపీ నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు. పెరిగిన పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కడియాల లక్ష్మీసాగర్, నెమిలయ్య, గణపర్తి వెంకటేశ్వర్లు, కొండలు, కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు. దేకనకొండ గ్రామంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పంచాయతీలలో సచివాలయ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు అందజేశారు.


దొనకొండలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలందరికీ మేలు

ముండ్లమూరు, జూలై 1: ప్రజా ప్రభుత్వంలో పేదలందరికీ మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని సింగనపాలెంలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీ పీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, మానం నరసింహారావు, వరగాని పౌలు, కంది మళ్ళ చంద్రమౌళి, ఇందూరి పిచ్చిరెడ్డి, బేతపూడి బ్రహ్మేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని మారెళ్ళలో సుంకర రాఘరెడ్డి, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, పాలపర్తి సుబ్బారావు, పసుపుగల్లులో ఇందూరి పిచ్చిరెడ్డి, వరగాని పౌలు, పోలవరంలో కొర్రపాటి శ్రీనివాసరావు తదితరులు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

తాళ్లూరు, జూలై 1: అర్హులందరికీ పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ముందుగా ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ తీసుకున్న వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి స్వామి తదితరులు

దొనకొండలో పరిశ్రమల ఏర్పాటే లక్ష్యం

దొనకొండ, జూలై 1: ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రుల సంపూర్ణ సహకారంతో దొనకొండలో పరిశ్రమల ఏర్పాటే తమ ప్రధాన లక్ష్యమని టీడీపీ నియోజ కవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. అందుకు బాధ్యతగా కృషి చేస్తామని చెప్పారు. సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో స్థానిక ఒబ్బాపురంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేసి తెలుగు యువత నేత కుందుర్తి లక్ష్మణ్ ఏర్పాటుచేసిన భారీ కేకును కట్ చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, మోడి వెంకటేశ్వర్లు, ఎంపీ డీవో వసంతరావునాయక్, మాజీ జడ్పీటీసీ పులిమి రమణాయాదవ్, కామేపల్లి చెంచయ్య, వడ్లమూడి చెన్నయ్య, కందుల నారపురెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, సింగ మనేని హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల బకాయితో కలిపి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో పండగలా నిర్వహించారు.

పల్లెల్లో పింఛన్‌ల పండగ

» ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

» పలుచోట్ల చంద్రబాబు

చిత్రపటాలకు పాలభిషేకం


పామూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు, జూలై 1: పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎన్టీర్ భరోసా పథకం కింద పింఛన్ పంపిణీని స్థానిక విరాట్ నగర్ కాలనీలో సోమవారం నిర్వహించగా ఎమ్మెల్యే ఉగ్ర, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్య మవుతుందని చెప్పారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి లబ్ధిదారుల చేత పాలభిషేకం చేయించారు. అలాగే, మండలంలోని వగ్గంపల్లి, ఇనిమెర్ల, లక్ష్మీనరసాపురం, మోపాడు, నుచ్చుపొద, గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ కార్యక్రమాన్ని కోటపాటి జనార్దనరావు ప్రారంభించారు. పాబోలువారిపల్లిలో మాజీ ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, సుబ్బక్కపల్లిలో మాజీ ఎంపీపీ జి.దశరథరాములు, పోకా నాయుడుబాబు, పారా వెంకటేశ్వర్లు, వగ్గంపల్లిలో బైరెడ్డి జయరామిరెడ్డి, పామూరులోని ఆకులవీధిలో ఉప్పలపాటి హరిబాబు, వీరభద్రాపురంలో పువ్వాడి రామారావు, కందులవారిపల్లిలో యారవ శ్రీనివాసులు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు.

సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఉగ్ర పాల్గొని పాలభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, సీఐ ఎం. రామానాయక్, ఎస్ఐ ప్రేమ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఎన్‌సీ మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు భరోసా..

కనిగిరి, జూలై 1: వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ ఎంతో భరోసా అని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి మహిళలు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏది అవసరమో, ఎలాంటి అవసరమో గుర్తించి వారికి నేరుగా లబ్ధి చేకూర్చటమే చంద్రబాబు పాలనా విధానమని మరోసారి రుజువు చేశారన్నారు. వచ్చే ఐదేళ్ళలో ప్రజాసంక్షేమ పాలన అందించే దిశగా చంద్రబాబు పింఛన్‌తో ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఎన్టీయార్ భరోసా పింఛన్ కనిగిరి మున్సిపాల్టీ, మండలంలోని వివిధ గ్రామాల్లో పండుగ వాతావరణంలో తెలుగుతమ్ముళ్ళు, అధికారులతో కలసి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముస్లిం మైనారిటీ పట్టణాధ్యక్షుడు గుడిపాటి ఖాదర్ పట్టణంలో, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి మండలంలోని తక్కెళ్ళపాడు, నారపరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో, కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులరెడ్డి యడవల్లి, ఎర్రోబనపల్లి తదితర గ్రామాల్లో పింఛన్‌తో పాటు అవ్వా తాతలకు నేతి మిఠాయిలు అందించి సంబరాలు చేసుకున్నారు. అలాగే, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి ఇంటింటికి తిరుగుతూ పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

పింఛన్ పెంచిన ఘనత చంద్రబాబుదే

వెలిగండ్ల, జులై 1: పింఛన్ పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మరపగుంట్లలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పింఛన్‌లు పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు కార్యక్రమంలో కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల కృష్ణారెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, కాశయ్య మౌలాలీ, ఒంగోలు శ్రీను, తదితరు లు పాల్గొన్నారు.

90 శాతం పెన్షన్‌ల పంపిణీ

పీసీపల్లి, జూలై 1: పీసీపల్లి మండలంలో సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ 90.42శాతం పూర్తయింది. మండలంలో పెన్షన్ లబ్ధిదారులు 4823 మంది ఉండగా, సాయంత్రం వరకు 4361 మందికి సచివాలయ సిబ్బంది పెన్షన్ నగదును పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో ఏవీ సుబ్బారావు చెప్పారు.

కాగా, ఎన్నికల ముందు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే చంద్రబాబు నాయుడు పెంచిన పెన్షన్‌ను ఇళ్ల వద్దే పంపిణీ చేయించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మండలం లోని చిరుకూరివారిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.


కనిగిరిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, పాల్గొన్న ఆర్డీవో, కమిషనర్

సచివాలయ సిబ్బంది తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

తాళ్లూరు, జూలై 1: మండలంలోని విఠలాపురం, శివరాంపురం గ్రామ పంచాయతీల్లో సోమవారం అధికార టీడీపీ నేతలను పిలవకుండా సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీని ప్రజాప్రతినిధులతో చేయించాలని, ప్రయివేట్ వ్యక్తులతో చేయిస్తే లీగల్ చర్యలు తీసుకుంటానని ఎంపీడీవోకు విఠలాపురం వైసీపీకి చెందిన సర్పంచ్ వాట్సాప్ మెసేజ్ పెట్టారు. సదరు మెసేజ్‌ను ఎంపీడీవో ఆగ్రామ సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. ఈవిషయమై సచివాలయ సిబ్బంది అధికారిని అడుగగా టీడీపీ నాయకులను పిలువకుండా మీరే పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆగ్రామ సచివాలయ సిబ్బంది అధికార టీడీపీ నేతలకు సమాచారం ఇవ్వకుండా పెన్షన్లు పంపిణీ చేయటంతో మండల స్థాయి టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివరాంపురం గ్రామంలో కూడా సచివాలయ సిబ్బంది తమ ఇష్టానుసారం అధికార టీడీపీ నేతలను లెక్కచేయక పెన్షన్లు పంపిణీ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పెన్షన్ నగదు పెంచి కూటమి నేతలను పిలిచి పండుగవాతావరణంలో పంపిణీ చేయాలని సూచించగా విఠలాపురం వైసీపీ సర్పంచ్ చెప్పినట్లు టీడీపీ నేతలను ఎందుకు పిలవలేదని ఎంపీపీ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు నిలదీశారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో విఠలాపురం, శివరాంపురం గ్రామసచివాలయాల సిబ్బందితో మాట్లాడారు. ఎందుకు ఇలా చేశారని ప్రశ్నించారు. విఠలాపురం సర్పంచ్ పెట్టిన మెసేజ్ గురించి వివరించగా పెన్షన్ల పంపిణీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగానే పంపిణీ చేయాలని ఎక్కడాలేదని, ఆ గ్రామానికి ఎంపీటీసీగా, అధికారపార్టీ ఎంపీపీగా ఉన్న తన దృష్టికి ఎందుకు తీసుక రాలేదని ప్రశ్నించటంతో వాళ్లు నీళ్లు నమిలారు. తాము ఎంపీడీవోకు చెప్పగా సర్పంచ్ అలాంటి మెసేజ్ పెట్టాడని, మీరే ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారన్నారు. ప్రభుత్వం చెప్పిన పనులు చేయటం ఉద్యోగుల బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్


దర్శిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

దర్శి, జూలై 1: దర్శి పట్టణంలో సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ తమీన్ అన్సారియా పరిశీలించారు. ఉదయం 8 గంటల సమయంలో నేరుగా దర్శి పట్టణంలోని శివాలయం వీధికి వచ్చారు. సచివాలయ సిబ్బంది అక్కడ పంపిణీ చేస్తున్న పింఛన్లను పరిశీలించారు. అప్పటివరకు జరిగిన పంపిణీపై ఆన్‌లైన్‌లో తనిఖీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నారా, లేదా అనే విషయాన్ని పరిశీలించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రంలోపు 99 శాతం పూర్తి చేయాలన్నారు. సాంకేతిక కారణాలవల్ల ఎక్కడైనా నిలచిపోతే మంగళవారం పూర్తిచేసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యవైఖరి అవలంబించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ సుజాత, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.





పెనుమాకలో పింఛన్ దారు పాముల నాయక్‌కు ఇళ్ల పట్టా అందజేస్తున్న సీఎం చంద్రబాబు



రేపల్లెలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్, ఆర్డీవో హేలా షారోన్



అమర్తలూరులో ఆనందబాబు



దేవరపల్లి ఎస్సీ కాలనీలో సాంబశివరావు



కొండమంజులూరు బీసీ కాలనీలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవి



స్టువర్టుపురంలో వేగేశన నరేంద్రవర్మ



చీరాలలో కొండయ్య

బాపట్ల జిల్లాలో 94.75 శాతం పంపిణీ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బాపట్ల జిల్లా పింఛన్ల పంపిణీలో ముందడుగులో ఉంది. ఆ జిల్లాలో 2,33,102 మంది లబ్ధిదారులు వుండగా వారిలో 1,13,547 మందికి, అంటే 94.75 శాతం మందికి తొలిరోజే ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన నగదు రూ. 157.11 కోట్లకుగానూ, 148.92 కోట్లు అందజేశారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 492.76 కోట్ల రూపాయలు తొలిరోజు అందజేశారు.

వలంటీర్లు.. లేకున్నా..

- సచివాలయ సిబ్బందితోనే పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ
- సాయంత్రం 6 గంటలకు 90 శాతం పంపిణీ పూర్తి
- సర్వర్ సమస్య తలెత్తినా వేగం తగ్గకుండా ముందుకు
- తొలిరోజే 469 కోట్ల రూపాయల అందజేత
- చేసి చూపించిన కూటమి ప్రభుత్వం

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం తొలిరోజు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. జిల్లాలోని ప్రతి ఒక్క పింఛనుదారుకు తొలిరోజే పెంచిన పింఛన్లు అందజేయాలన్న టార్గెట్‌ను ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసింది. సోమవారం మధ్యాహ్నం సర్వర్ సమస్య తలెత్తినప్పటికీ పింఛన్ల పంపిణీలో జాప్యం జరగకుండా సచివాలయ సిబ్బంది జాగ్రత్త పడ్డారు. అనుకున్న విధంగా సాయంత్రం అరు గంటలకల్లా బాపట్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 90 శాతం మందికి పింఛన్లు అందజేసి తమ సత్తా ఏంటో సచివాలయ ఉద్యోగులు చూపించారు.

● గత ప్రభుత్వ నిర్వాకంతో 33 మంది బలి

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే, ఆ నెపం ప్రతిపక్షాలపై నెట్టేందుకు గత ప్రభుత్వం కుట్రలు చేసింది. సచివాలయ సిబ్బందితో ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు పంపిణీ చేయవచ్చని ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీలు ఎంత మొత్తుకున్నా లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి ఎండలో నిలబెట్టారు. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఫలితంగా ఏప్రిల్ నెలలో 33 మంది వృద్ధులు అన్యాయంగా చనిపోయారు. ఆ నేరాన్ని ప్రతిపక్షాలకు ఆపాదించాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ ప్రజలు వాటిని నమ్మలేదు. కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారు. తాము అధికారంలోకి వచ్చాక వలంటీర్ల సహాయం లేకపోయినా పింఛన్లు పంపిణీ చేయొచ్చని కూటమి ప్రభుత్వం చెప్పడమే కాకుండా, చేసి చూపించింది. తొలి రోజు సాయంత్రం 6 గంటలకల్లా రాష్ట్రంలోని 92 శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

● గుంటూరు జిల్లాలో 95.17 శాతం పంపిణీ

విభజిత గుంటూరు జిల్లాలో మొత్తం 2,58,786 మంది పింఛనుదారులు వుండగా వారిలో 95.17 శాతం మందికి, అంటే 2,34,367 మందికి సాయంత్రం 6గంటలలోపు పింఛను అందజేశారు. వారికి రూ.173.29 కోట్లకుగానూ రూ.165.15 కోట్లు అందజేశారు.

● పల్నాడు జిల్లాలో 93.36 శాతం పంపిణీ

పల్నాడు జిల్లా పింఛన్ల పంపిణీలో ఒకడుగు వెనుక ఉంది. సంఖ్యా పరంగా లబ్ధిదారులు ఎక్కువగా ఉండడం, మారుమూల లోతట్టు ప్రాంతాలు ఉండడంతో పింఛను పంపిణీలో కొంత జాప్యం జరిగింది. జిల్లాలో 2,79,975 మందికి గానూ 2,45,847 మందికి పింఛను అందజేశారు. రూ. 190.09 కోట్లకుగానూ రూ. 178.71 కోట్లు లబ్ధిదారులకు అందజేశారు.

ఉదయం నుంచే పండగలా..

బాపట్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ నేతలు ఉదయంనుంచే పింఛన్ పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాపట్ల రూరల్‌లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పింఛన్ పంపిణీలో పాల్గొనగా, వేమూరు మండల పరిధిలోని జంపని గ్రామంలోని ఎస్సీకాలనీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. దేవరపల్లి ఎస్సీకాలనీలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు.చీరాలలో ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉదయం నుంచే రేపల్లె నియోజకవర్గ పరిధిలోని పలు చోట్ల లబ్ధిదారులకు పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి లబ్ధిదారులకు మంత్రి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేశామని, పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ ఉద్యోగుల చేత పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. రూ.7,000లు పింఛన్ అందుకున్న వృద్ధుల ముఖాల్లో ఇంటి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబును చూసుకుంటున్న ఆనందం కనబడుతుందని అనగాని అన్నారు. జిల్లాకు చెందిన మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సాయంత్రం పంగులూరు, కొరిశపాడు మండలాల పరిధిలో పలు చోట్ల పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు.




తెనాలిలో పింఛన్ అందుకున్న వృద్ధురాలు



- అధికారంలోకి వచ్చిన 26 రోజుల్లో హామీ అమలు
- 'పెంఛన్ తీసుకు వచ్చింది అన్న ఎన్టీఆర్
- పెంచిన పింఛన్లలో నా వాటానే ఎక్కువ
- రూ. 4 వేలల్లో నా వాటా పెంపు అక్షరాలా రూ. 2,840
- వలంటీర్లు వద్దన్నారని 33 మందిని బలి తీసుకున్న గత ప్రభుత్వం
- సచివాలయ సిబ్బందితోనే పంపిణీ చేయగలమని నిరూపిస్తాం
- మేం మీకు సేవకులమే.. పెత్తందారులం కాదు
- ఒక్క జిల్లాలో రూ. 111 కోట్లు పింఛను ఇచ్చిన ఘనత ఎన్డీఏదే !
- రాష్ట్రంలో ప్రతి 9 మందిలో ఒకరికి పింఛను
- పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

పేదింట.. పింఛన్ పండుగ



పాములు నాయక్ ఇంట్లో టీ తాగుతున్న సీఎం చంద్రబాబు

పెనుమాకలో పంపిణీ ప్రారంభించిన సీఎం చంద్రబాబు

గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'పెన్షన్ పండుగకు నేనొచ్చా. అధికారంలోకి వచ్చిన 26 రోజుల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛను పెంచి మీకు అందించడానికి వచ్చా. అదే ప్రజా సంక్షేమం పట్ల టీడీపీ, ఎన్డీయేకు వున్న చిత్తశుద్ధి. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మందికి ఒక్క నెలలో 4,408 కోట్ల రూపాయలు పింఛన్ల ద్వారా అందిస్తున్నాం. అదే ఏడాదికైతే రూ.33,100 కోట్లు, ఐదేళ్లకు రూ. లక్షా 65వేల 500 కోట్ల రూపా యలు పేదలకు ఎన్డీయే ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ అందించబోతోంది. రాష్ట్రంలో ప్రతి 9 మందిలో ఒకరికి పింఛన్లు అందిస్తున్నా. నాకు ఇంత కంటే ఆనందమైన రోజు ఇంకొకటి లేదు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అందజేయడం భగవంతుడు నాకిచ్చిన అవకాశంగా భావిస్తున్నా' అంటూ ముఖ్యమంత్రి ఉద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. పెనుమాక గ్రామంలో అత్యంత పేదరికంలో మగ్గిపోతున్న గిరి జన కుటుంబం వద్దకు వెళ్లి సోమవారం ఉదయం ఆరున్నర గంటలకల్లా ఇంటి పెద్ద బనావత్ పాములు నాయక్‌కు వృద్ధాప్య పింఛను, ఆయన భార్య సీతకు సీఆర్డీఏ పింఛను, వితంతువైన ఆయన కూతురు సాయికి వితంతు పింఛను ఆయన చేతుల మీదుగా అందించారు. వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇల్లులేని వారికి ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తీసుకున్నారు. ఏడాదిలోపు ఇల్లు కట్టించి ఇస్తానని వారికి హామీ ఇచ్చి, బాధ్యతను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అప్పగించారు. అనంతరం అక్కడే వారు ఇచ్చిన టీ తాగారు. అనంతరం ప్రజలను ఉద్దేశిం చి ఆయన మాట్లాడారు. 'మీ అందరి దయ, ఆశీస్సులతో నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికై మొట్టమొదటి కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టా. రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గంలో మిమ్మల్ని గౌరవించడానికి, మీకు సేవ చేయడానికే పెనుమాకలో ఈ కార్యక్రమం తీసు కున్నా. మంగళగిరిలాంటి నియోజకవర్గంలో 92 వేల మెజారిటీ రావడమంటే మామూలు విషయం కాదు. అందుకు కారణం ఐదేళ్ల పీడకల! రాష్ట్రాన్ని పట్టి పీడించిన వైనం, కనీసం ఇలా కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. ప్రశాంతంగా పడుకునే పరిస్థితి లేదు. పోలీసులు గోడ దూకి నా ఇంటికి కూడా వచ్చే పరిస్థితి నెలకొంది. అలాంటి భయంకర వాతావ రణంలో ఐదేళ్లు బతికాం. ఇప్పుడు అంతా మారిపోయిం ది. ప్రజా ప్రభుత్వం వచ్చింది. ప్రజల కోసం మేమంతా కష్టపడతాం. సంపద సృష్టిస్తాం. ఆ సంపదను పేదలకు అందజేస్తాం. పేదరికం లేని సమాజాన్ని సృష్టించి మా నిజాయితీని నిరూపించుకుంటాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తాను ఎప్పుడూ సేవకుడినేనని, తమ ప్రభుత్వంలో అందరూ ప్రజలకు సేవే చేస్తారని, తామెవ్వరూ పెత్తందారులం కాదని, మీ వద్దకు వచ్చి రచ్చబండ మీద కూర్చుని మీలో ఒకరిగా మీ సమస్యలు విని పరిష్కరించేందుకు కృషి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని మంత్రులైన నారా లోకేశ్, శ్రీనివాసరావులను హెచ్చరించారు.

● పింఛను పెంపులో మూడొంతులు నా వాటానే!

మొట్ట మొదటగా పింఛన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్. ఆ రోజుల్లోనే రూ. 35 పింఛను ఇచ్చారు. 94- 95లో దాన్ని నేను 75 రూపాయలకు పెంచాను. ఆ తరువాత 2014 నాటికి ఆ 75 రూపాయలు 200 రూ పాయలకు పెంచారు. 2014లో నేను అధికారంలోకి వస్తూనే రూ. 200 పింఛనును రూ. 1000కి పెంచాను. ఆ తరువాత మళ్లీ దాన్ని రూ. 2వేలకు పెంచాను. ఇప్పు డు రూ. 3 వేల పింఛనును 4వేలకు పెంచాను. మొత్తం గా రూ. 4000 పింఛనులో తాను పెంచిన వాటా 2,840 రూపాయలు. పింఛన్ల పెంపు ద్వారా పేదలను ఆదుకోవడంలో తామెప్పుడూ ముందుం టామని చంద్రబాబు చెప్పారు. దివ్యాంగులకు రూ. 6వేలు, తలసీమియా, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి బాధితులకు రూ. 10వేలు, సీరియస్ డయాలసిస్, మంచంపట్టినవారికి రూ. 15వేలు పింఛను ఇస్తున్నామన్నారు.

అత్యాచారం చేస్తే అదే ఆఖరిరోజు..

సభికులతో చర్చ నేపథ్యంలో చంద్రబాబు మహిళలకు ధైర్యం కల్పించారు. బాపట్ల జిల్లా ఈపూరుపాలెంలో జరిగిన అత్యాచార ఘటన ప్రస్తావనకు వచ్చిన సందర్భంగా ఆయన మదాంధకారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. 'రాష్ట్రంలో అందరికీ హెచ్చరిక చేస్తున్నా.. ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వచ్చి మదాంధకారంతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తే వదిలిపెట్టను. ఎవడైనా అత్యాచారం చేస్తే అదే వాళ్లకు ఆఖరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నా. ప్రభుత్వంతో తమాషాలు ఆడొద్దు. యాంటి సోషల్ ఎలిమెంట్ ఎవరైనా సరే నిర్మొహమాటంగా అణచివేస్తా. మర్యాదగా ఇప్పటి వరకూ చెప్పా. ఎవరైనా కైపెక్కి, లేదా గంజాయి తాగేసి, మద్యం తాగేసి ఇష్టానుసారం చేస్తే తీవ్ర పరిణామాలు వుంటాయి. నాకు అన్యాయం జరిగిందని ఒక ఆడబిడ్డ నా దగ్గరకు వచ్చిందంటే ఎవ్వరినీ వదిలిపెట్టను. అది స్వయంగా మీరే చూస్తారు.మహిళల్లో ధైర్యం కల్పించడం కోసమే దళిత మహిళ అయిన వంగలపూడి అనితను హోం మంత్రిగా చేశానని చెప్పారు.



మంగళగిరి వేదిక కావడం సంతోషం : లోకేశ్

రాష్ట్ర ప్రభుత్వ తొలి కార్యక్రమానికి మంగళగిరి వేదిక కావడం ఆనందంగా ఉందని మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. పెనుమాకలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ గెలవలేదని, 2019లో 5,300 ఓట్ల తేడాతో నేను ఓడిపోయానని, ఐదు సంవత్సరాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యానని ఆయన అన్నారు. పోయినసారి తగ్గిన ఓట్ల సంఖ్యకు పక్కన మరో సున్నా చేర్చి 53,000 ఓట్ల మెజారిటీ ఇస్తారని ఎన్నికలకు ముందే తాను చెప్పానన్నారు. కానీ తాను ఊహించినదానికన్నా 91 వేల ఓట్ల మెజారిటీతో ప్రజలు తనను దీవించారన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు వున్నాయి. రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు ఉన్నాయని, మూడు నాలుగు దశాబ్దాలుగా కొండపోరంబోకులో ఇళ్లు కట్టుకుని నివాసం వుంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి వుందని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం కావాలని సీఎంను లోకేశ్ కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం తన నియోజకవర్గం మంగళగిరిలో తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తామంతా చంద్రబాబు వెంటే వుంటామని, అమరావతి నిర్మాణం, సీడ్ యాక్సిస్ రోడ్డు అభివృద్ధిలో తామంతా బాబు తోడుంటామని చెప్పారు. అమరావతి నిర్మాణంలో భాగస్వాములవుతామని నియోజకవర్గ ప్రజల తరుపున ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు తమ్మిశెట్టి జానకీదేవి, నందం అబద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.





పెనుమాకలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజలు



తెనాలి: కఠెవరంలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



పింఛన్ అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



పింఛన్ అందుకున్న ఆనందంలో వృద్ధురాలు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి : మంత్రి అనగాని



స్టాప్ డయేరియా ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూలై 1: వర్షాకాలం సమీపిస్తుండటంతో గ్రామాల్లో పర్యావరణం పరిశుభ్రంగా ఉంచే విధంగా దోమలు వృద్ధి చెందకుండా అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 13వవార్డులో స్టాప్ డయేరియా ర్యాలీకి జెండా ఊపి అనగాని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆరోగ్యశాఖ జారీచేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూ చించారు. ప్రతి ఇంటికి వెళ్లి అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలను సందర్శించి ప్రతి ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు 14రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను పంపిణీ చేయాలని సూచించారు. పట్టణ, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.మాణిక్యమ్మ, సూపర్‌వైజర్ కె.శివజ్యోతి, సింగం వాణిశ్రీ, డాక్టర్లు రమేష్, ప్రసాద్, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

శింగరకొండలో అనిల్ రావిపూడి పూజలు

అద్దంకి, జూలై 1 : అద్దంకి పట్టణంతో పాటు శింగరకొండతో చిన్నతనం నుంచి విడదీయరాని అనుబంధం ఉందని సినీ దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. విక్టరీ వెంకటేష్‌తో ఈ నెల 3వ తేదీన సినిమా షూటింగ్ ప్రారంభించనున్న నేపథ్యంలో స్క్రిప్ట్‌ను సోమవారం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం అనిల్ రావిపూడిని పూజారులు సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అద్దంకిలో చదువుకున్నట్లు చెప్పారు. వెంకటేష్‌తో తీసే ఈ సినిమాలో హిరోయిన్‌లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు నుంచి నవంబర్ వరకు నాన్‌స్టాప్‌గా షూటింగ్ పూర్తి చేసి సంక్రాంతికి విడుదల చేస్తామన్నారు. సినిమా కథ ఎఫ్2, ఎఫ్3లకు భిన్నంగా క్రైమ్ జోన్ నేపథ్యంలో సాగుతుందన్నారు. చిన్నతనం నుంచి ఏ కార్యక్రమం మొదలు పెట్టాలన్నా ముందు ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకుంటుంటానని తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులతో కలిసి శింగరకొండలో కొద్ది సేపు గడిపారు.



అనిల్ రావిపూడిని సత్కరిస్తున్న పూజారులు

వృద్ధురాలి దారుణహత్య

అల్లుడే చేశాడని అనుమానం

ఏడాది క్రితం భార్యను హతమార్చాడు

మార్కాపురం రూ రల్, జూలై 1: వృద్ధురాలిని గొంతు కోసి హత్య చేసిన ఘటన వేములకోట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెసాని నారాయణమ్మ(60) ఆమె నివాసంలో ఆరుబయట నిద్రిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గొంతు కోసి పరారయ్యాడు. నారాయణమ్మ కుమారుడు ఉదయం నిద్ర లేచి తల్లిని చూడగా రక్తపుమడుగులో మృతిచెంది కనిపించింది. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి డీఎస్పీ బాలసుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును, ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఏఎస్పీ శ్రీధర్‌బాబు హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. హత్య జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకొంది. నారాయణమ్మ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ హత్య కేసులో అనుమానిత వ్యక్తి రేల శీను పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అల్లుడిపైనే అనుమానం

మృతురాలు నారాయణమ్మను ఆమె అల్లుడు రేలా శ్రీను గొంతు కోసి హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఏడాది క్రితం భార్య సునీతను రోకలి బండతో మోది హత్య చేసిన కేసులో శ్రీను నిందితుడిగా ఉన్నారు. 2023 మార్చిలో ఈ హత్య చేశాడని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే అత్తపై కూడా కక్ష పెంచుకొని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమికంగా సమాచారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వేములకోటకు చెందిన నారాయణమ్మ కుమార్తెను పైపాలెం మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన రేల శీనుకు ఇచ్చి 12ఏళ్ల క్రితం వివాహం చేశారు. శ్రీను ఆటో నడిపేవాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. అనుమానంతో భార్యను గతేడాది మే నెలలో రోకలిబండతో మోది హత్య చేసినట్లు కేసు నమోదైంది. ఈ నేపథ్యంలోనే శ్రీను అత్త దారుణ హత్య జరగడం గమనార్హం. ప్రస్తుతం శ్రీను పిల్లలు వారి నాయనమ్మ వద్దే ఉంటున్నారు.

నిలువనీడ పోతుంది.. కాపాడండి సారూ..!

హైవే నిర్మాణంలో గూడు కోల్పోతున్న స్థానికులు ఆవేదన

ప్రత్యామ్నాయం చూపాలని అధికారులకు వేడుకోలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 1 : జాతీయ రహదారి నిర్మాణాలు జరుగుతున్న క్రమంలో ఉన్న గూడు పోతుంది కాపాడండి సారూ అంటూ చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని సిండికేట్ వీవర్స్ కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. వాడరేవు - పిడుగురాళ్ల వరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణాలు చేపట్టింది. ఈక్రమంలో సంబధిత పనులు వేగం పెరుగుతుంది. సిండికేట్ వీవర్స్ కాలనీలో సుమారు 50 కుటుంబాలు 30 ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని కూలినాలి చేసుకుని జీవిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా వీరందరి గుడిసెలను తొలగించేందుకు రెండు నెలలుగా అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలుమార్లు అధికారులు వాళ్లకు సమాచారం ఇచ్చారు. దీంతో నిరుపేదల పరిస్థితి దయనీయంగా మారింది. తమకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా, కనీస నోటీసులు లేకుండా ఇళ్లు తొలగింపు అన్యాయమని బోరుమన్నారు. బాధితులు సీపీఎం నాయకులు కొండయ్య, బాబూరావుతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. సమస్యను అధికారులకు వివరించి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా జిల్లా స్పందన కార్యాలయంలో అధికారులను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన అధికారులు వీరికి ప్రత్యామ్నాయం కల్పిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులతోపాటు శ్రీనివాసులు, వెంకటేశ్వరమ్మ, ఇస్సాకు, అనితరాణి, సీతమ్మ పాల్గొన్నారు.

ఇరు కుటుంబాలను పరామర్శించిన మంత్రి

మేదరమెట్ల , జూలై 1 : మండలంలో ఆదివారం మృతి చెందిన ఇద్దరు టీడీపీ నాయకుల కుటుంబాలను విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం రాత్రి పరామర్శించారు. కుర్రవానిపాలెంకు చెందిన తెలుగుదేశం నాయకులు నాదెండ్ల బవన్నారాయణ సోదరుడు నాదెండ్ల శివకోటేశ్వరరావు(55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వారి నివాసానికి వెళ్లిన రవికుమార్ శివకోటేశ్వరరావు మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మేదరమెట్ల తెలుగుదేశం నాయకులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రేగుల వెంకటరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వెంకటరావు మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జాగర్లమూడి జయకృష్ణ, నాదెండ్ల దశరదరామయ్య, కోటా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, నాదెండ్ల ఆంజనేయులు(తెనాలి), మేదరమెట్ల శ్రీనివాసరావు, సింగమనేని శ్రీనివాసరావు, బొల్లేపల్లి సుబ్బారావు, చెన్నుపాటి హరిబాబు పాల్గొన్నారు.

పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

దేవరపల్లి(పర్చూరు), జూలై 1 : ప్రజా కూటమి ఘన విజయం, ఎమ్మెల్యే ఏలూరి అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమల తిరుపతికి దేవరపల్లి తెలుగుదేశం పార్టీ నేతలు చేపట్టిన పాదయాత్రను సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. పాదయాత్రకు పెద్ద పెత్తున ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పాదయాత్ర చేసే యువకులకు ఆయురారోగ్యం ఇవ్వాలని, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాపు రవిచంద్ర, కొమ్మాలపాటి సురేష్, కొరిటాల సురేష్, కొరిటాల శ్రీనివాసరావు, గండు నాగేశ్వరరావు, తోకల రాజశేఖర్, దొప్పలపూడి రాంబాబు, వేణుబాబు పాల్గొన్నారు.

బాలికలపై అక్రమ కేసు ఎత్తివేయాలంటూ వినతి

బాపట్ల, జూలై 1 : తమపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేసి తమపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జిల్లాలోని కొరిశపాడు మండలం ప్రాసంగలపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలికలు వినతిపత్రం అందజేశారు. ఉద్దేశపూర్వకంగా గ్రామానికి చెందిన తమ్మిశెట్టి నాగదేవి, రాజేంద్ర, రత్తమ్మలు కర్రలతో ఇష్టానుసారంగా తమను కొట్టి అసభ్య పదజాలంతో దూషించారని బాధిత బాలికలు ఈర్ల అర్చన, కీర్తనలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్ళగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించుకోవాలని పోలీసులు చెప్పటంతో తాము ఆసుపత్రికి వెళ్ళామన్నారు. ఆ తర్వాత ఇంటికొచ్చేసరికి మామీదే ఫిర్యాదు చేస్తారా అంటూ మరోసారి దౌర్జన్యం చేసి చంపుతామని బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫోన్ ద్వారా తెలియజేశామని, గ్రామంలో పెద్దలకూ చెప్పామని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా గతనెల 23న తమపై పోలీసుస్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారని చెప్పారు. పోలీసులు కేసు కట్టాం బెయిల్ తీసుకోండి అంటూ తమను బెదిరిస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి బాలికలు జిల్లా పోలీసు కార్యాలయంలో వినతిపత్రం ద్వారా తెలియజేశారు.

పింఛన్ పెంచి.. ఇంటికి చేర్చి..!

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినెలలోనే

సామాజిక పింఛన్ల హామీ అమలు

రూ.4వేలు పెంపుతోపాటు మరో రూ.3వేల

బకాయిలు కలిపి రూ.7వేలు అందజేత

పండుగలా సాగిన పంపిణీ కార్యక్రమం

మంత్రి నుంచి కార్యకర్త వరకు భాగస్వామ్యం

సచివాలయ సిబ్బందితో ఒక్కరోజులోనే పంపిణీ

ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్‌కు నివాళులు

చంద్రబాబు ఫొటోలకు పాలభిషేకం

ఉదయం ఆరుగంటలకే వీధుల్లో

టీడీపీ శ్రేణులు, అధికార యంత్రాంగం

ఒంగోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పింఛన్ల పండుగ చేశారు. పెంచిన ఎన్టీఆర్ భరోసా మొత్తాల పంపిణీని టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలోనూ అటు ప్రభుత్వ ప్రతినిధులు, యంత్రాంగం, ఇటు టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాల పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2,91,524మంది వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, దివ్యాంగులు ఇతర వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పెంచిన పింఛన్ మొత్తాలు, అలాగే బకాయిలు కలిపి సుమారు రూ.199.07 కోట్లు మేర అందజేశారు. ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ ప్రారంభం కాగా మధ్యాహ్నానికే మూడొంతులు పంచారు. అలా సాయంత్రం ఆరున్నర గంటల సమయానికి సుమారు 93.71 శాతంతో 2,73,189మందికి దాదాపు రూ.178.43 కోట్ల మేర నగదు అందజేశారు. ఆ తర్వాత కూడా అందుబాటులో ఉన్న లబ్ధిదారులందరికీ ఇచ్చారు. అలా ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి వరకు ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాజంపల్లిలో మంత్రి పంపిణీ

జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, టీడీపీ నాయకులు దామచర్ల సత్యలు ఉదయం ఏడు గంటలకే తమ స్వగ్రామమైన తూర్పు నాయుడుపాలెంలో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పించి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి స్వామి దర్శి మండలం రాజంపల్లిలో పింఛన్లు పంపిణీ చేయగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలు పాల్గొన్నారు. ఆ తర్వాత మర్రిపూడి, కొండపిలలోనూ మంత్రి స్వామి పాల్గొనగా సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాల్లో సత్య పాల్గొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని ఐదారు డివిజన్లలో పలు ఇళ్లకు తిరిగి పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు సాయంత్రం అద్దంకి బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద దివ్యాంగులు నిర్వహించిన చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయుమార్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని దాదాపు పది గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు స్థానిక నేతలు అధికారులతో కలిసి పాల్గొన్నారు.

కనిగిరిలో పండుగ వాతావరణం..

కనిగిరి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉదయం ఆరుగంటలకే కనిగిరి పట్టణంలోని పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం సాయంత్రం వరకు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లో పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తొలుత గిద్దలూరు పట్టణంలోనూ తర్వాత కంభంతో పాటు ఇతర మండలాల్లోనూ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంతోపాటు రూరల్ మండలం, అలాగే ఇతర మండలాల్లోని గ్రామాల్లో పాల్గొన్నారు. వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు ఉదయాన్నే ఎర్రగొండపాలెం పట్టణంలోనూ అనంతరం ఇతర మండలాల్లోనూ పాల్గొనగా దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఉదయం రాజంపల్లిలో మంత్రి స్వామితో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్న అనంతరం తాళ్లూరు ఇతర మండలాల్లో పాల్గొన్నారు అలాగే జిల్లా అంతటా అన్ని గ్రామాలు, పట్టణాల్లో పంపిణీ చేశారు.



వృద్ధురాలికి పింఛన్ నగదుఇచ్చి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

> రాష్ట్రంలో
> కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తొలి నెలలోనే పింఛన్ల హామీని నెరవేర్చింది.
> పేదలు, వృద్ధులు, అభాగ్యుల కళ్లల్లో ఆనందాన్ని నింపింది.
> ఇప్పటివరకు ఉన్న సామాజిక పింఛన్ మొత్తం రూ.3వేల నుంచి ఒకేసారి రూ.4వేలకు పెంచి సోమవారం అందజేశారు. రాష్ట్రప్రభుత్వంలో కీలకమైన మంత్రి మొదలు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి నాయకులు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. యంత్రాంగంలో కలెక్టర్ నుంచి సచివాలయ సిబ్బంది దాకా వేలాదిమంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలభిషేకం చేయడంతోపాటు పలు గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో గ్రూపు మీటింగ్‌లు ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేశారు.
> సోమవారం రాత్రికి 93శాతం వరకు పంపిణీ పూర్తయ్యింది.

నగదుతోపాటు పింఛన్ సర్టిఫికెట్, ముఖ్యమంత్రి చంద్రబాబు పేరుతో ఉన్న లేఖపత్రంను లబ్ధిదారులకు అందజేశారు.

హామీ నిలబెట్టుకున్నాం: మంత్రి స్వామి

ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో మంత్రి స్వామి, ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమం తెలుగుదేశం పార్టీలోనే సాధ్యమన్నారు. సామాజిక పింఛన్లు ప్రవేశపెట్టింది టీడీపీ అని తెలిపారు. 2014లో పార్టీ అధికారంలోకి వచ్చేనాటికి పింఛన్ వెయ్యి కాగా ఒకేసారి చంద్రబాబు రూ.2వేలు చేశారన్నారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఒకటి చెప్పి తర్వాత ప్రజలను మోసం చేసి ఐదేళ్లలో వెయ్యి మాత్రమే పెంచగా తాజాగా అధికారంలోకి తిరిగి టీడీపీ రాగానే ఒక్కసారిగా వెయ్యి పెంచి రూ.4వేలు ఇస్తున్నట్లు చెప్పారు. అంతేకాక అప్పట్లో ఉన్న పేదల సంక్షేమం కోసం, వారికి ఇచ్చిన మాట కోసం బకాయిలు రూ.3వేలు కూడా కలిపి ఇస్తున్నట్లు చెప్పారు. మీ భద్రత మా బాధ్యత అన్న నినాదంతో సామాజిక పింఛన్లు తమ ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు.

వృద్ధాప్యంలో ఎంతగానో ఆసరా

-నెలకుర్తి నాగరత్నమ్మ, లబ్ధిదారులు, పెద్దన్నపల్లి, పీసీపల్లి మండలం గత ప్రభుత్వంలో పెన్షన్‌ను వెయ్యి రూపాయలు పెంచడానికే జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల సమయం తీసుకున్నాడు. చంద్రబాబునాయుడు ఒకేసారి రూ.వెయ్యి పెంచుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సంతకం చేయడంతోపాటు జూలై 1నే ఇంటి వద్దనే ఇప్పించి మాటను నిలబెట్టుకున్నారు. సంక్షేమ పాలకుడు ఎవరంటే చంద్రబాబు నాయుడే గుర్తుకొస్తున్నారు.

చేస్తాం...చూస్తాం అంటే కుదరదు

ప్రతిరోజు మీ కోసం వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందే

కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1: చేస్తాం... చూస్తాం... నివేదికలు వచ్చాక పరిశీలించి చర్యలు తీసుకుంటామని అర్జీదారులతో మొక్కుబడిగా సమాధానాలు చెప్పే సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జరిగిన మీకోసం అర్జీల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. అన్నిశాఖల అధికారులు ప్రతిరోజు మీ కోసం వెబ్‌సైట్‌ను పరిశీలించి అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు వస్తే అవి స్థానికంగా పరిష్కారం కానివైతే ఉన్నతాధికారులకు నివేదించి అవి ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకుంటూ ఉండాలని ఆదేశించారు. విషయాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. అలా కాకుండా మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్డీసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మీకోసం అర్జీలను పరిష్కరించాలి

జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం మీ కోసం ఆర్జీలను స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా ఆయా ఆర్జీలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారం కోసం తగిన చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

- ప్రత్యామ్నాయం చూపకుండా కనిగిరిలో వీధివ్యాపారుల దుకాణాలను తొలగిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జివికొండారెడ్డి తెలిపారు. చెప్పులబజారు, ప్రధానవీధుల్లో 250మందికిపైగా వీధి వ్యాపారులు మున్సిపాల్టీకి ఆక్రమణ పన్ను చెల్లిస్తూ విద్యుత్ శాఖ ద్వారా మీటర్లు కూడా పొంది అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగింపులను ఏకపక్షంగా చేస్తున్నారని తెలిపారు. వారికి న్యాయం చేయాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

-డీఎస్సీ-24 నోటిఫికేషన్‌లో ఉర్దూ ఎస్‌జీటీ పోస్టులు, ఉర్దూ (ఎస్ఏ) పోస్టులను చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉర్దూ డెవలపమెంట్ సొసైటీ నాయకులు కోరారు. ప్రభుత్వం ఈనెల 12న జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉర్దూ మాధ్యమంలో జిల్లాకు సంబంధించిన పోస్టులు చూపలేదని, వాటిని చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

- జిల్లాలో వాటర్ స్కీంలలో పనిచేస్తున్న వాల్ ఆపరేటర్లు, పంపు మెకానిక్, ఎలక్ట్రీషియన్స్, పంపు ఆపరేటర్లు, ఫిట్టర్లను ఆదుకోవాలని ఏపీఆర్‌డబ్ల్యూఎస్‌అండ్‌ఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.మల్లికార్జున, కోటయ్య కోరారు. గత 25ఏళ్లుగా మంచినీటి పథకల్లో పనిచేస్తున్నామని తెలిపారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టు విధానంతో నష్టపోతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఇలా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం సమస్యలను విన్నవించారు.

ఉద్యోగులకు ఊరట

తొలిరోజే 60శాతం మందికి జీతాలు

నేడు మిగతావారికి పడే అవకాశం

వైసీపీ ప్రభుత్వంలో నెలంతా ఎదురుచూపులే

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 1 : జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు నెలంతా డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ఆ పరిస్థితి నుంచి ఎట్టకేలకు ఉద్యోగులు బయటపడ్డారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలతో పాటు ఉద్యోగులు కూడా తమకు సకాలంలో జీతాలు వస్తాయని ఆశించారు. అందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు 1వతేదైన సోమవారం పండుగ వాతావరణంలో సామాజిక పింఛన్లు ఒకవైపు పంపిణీ చేస్తుండగా ఇంకొకవైపు ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వేతనాలు వారి బ్యాంకు అకౌంట్లలో వేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 40వేలమందికిపైగా ఉద్యోగులు ఉండగా సోమవారం సాయంత్రానికి సుమారు 60శాతం మంది ఉద్యోగులు జీతాలు పడ్డాయి. అంటే 25వేల మందికిపైగా జీతాలు ఒకటో తేదీనే పడటంతో వారిలో కూడా ఆనందం వెల్లివిరుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. కనీసం పెంచకపోయినా పర్వాలేదు, ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలని ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా గత జగన్ సర్కార్ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే అటు సామాజిక పింఛన్‌దారులకు, ఇటు ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. సోమవారం రాత్రికి లేదా మంగళవారం ఉదయానికి మిగిలిన ఉద్యోగులకు కూడా జీతాలు పడే అవకాశం ఉందని ట్రెజరీ శాఖ అధికారులు చెప్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు కూడా బిల్లులు జనరేట్ అయిన వెంటనే పెన్షన్లు కూడా పడే అవకాశం ఉంది. సోమవారం ఉదయం నుంచే ఉద్యోగులకు తమ అకౌంట్లలో జీతాలు పడినట్లు మేసేజ్‌లు రావడంతో వారిలో విస్తృత చర్చ జరిగింది. గత ప్రభుత్వంలో జీతాల కోసం ఎదురుచూసే వాళ్ళమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

తాళ్లూరు, జూలై 1: మండలంలోని విఠలాపురం, శివరాంపురం గ్రామ పంచాయతీల్లో సోమవారం అధికార టీడీపీ నేతలను పిలవకుండా సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీని ప్రజాప్రతినిధులతో చేయించాలని, ప్రయివేట్ వ్యక్తులతో చేయిస్తే లీగల్ చర్యలు తీసుకుంటానని ఎంపీడీవోకు విఠలాపురం వైసీపీకి చెందిన సర్పంచ్ వాట్సాప్ మెసేజ్ పెట్టారు. సదరు మెసేజ్‌ను ఎంపీడీవో ఆగ్రామ సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. ఈవిషయమై సచివాలయ సిబ్బంది అధికారిని అడుగగా టీడీపీ నాయకులను పిలువకుండా మీరే పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆగ్రామ సచివాలయ సిబ్బంది అధికార టీడీపీ నేతలకు సమాచారం ఇవ్వకుండా పెన్షన్లు పంపిణీ చేయటంతో మండల స్థాయి టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివరాంపురం గ్రామంలో కూడా సచివాలయ సిబ్బంది తమ ఇష్టానుసారం అధికార టీడీపీ నేతలను లెక్కచేయక పెన్షన్లు పంపిణీ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం పెన్షన్ నగదు పెంచి కూటమి నేతలను పిలిచి పండుగవాతావరణంలో పంపిణీ చేయాలని సూచించగా విఠలాపురం వైసీపీ సర్పంచ్ చెప్పినట్లు టీడీపీ నేతలను ఎందుకు పిలవలేదని ఎంపీపీ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు నిలదీశారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో విఠలాపురం, శివరాంపురం గ్రామసచివాలయాల సిబ్బందితో మాట్లాడారు. ఎందుకు ఇలా చేశారని ప్రశ్నించారు. విఠలాపురం సర్పంచ్ పెట్టిన మెసేజ్ గురించి వివరించగా పెన్షన్ల పంపిణీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగానే పంపిణీ చేయాలని ఎక్కడాలేదని, ఆ గ్రామానికి ఎంపీటీసీగా, అధికారపార్టీ ఎంపీపీగా ఉన్న తన దృష్టికి ఎందుకు తీసుక రాలేదని ప్రశ్నించటంతో వాళ్లు నీళ్ల నమిలారు. తాము ఎంపీడీవోకు చెప్పగా సర్పంచ్ అలాంటి మెసేజ్ పెట్టాడని, మీరే ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారన్నారు. ప్రభుత్వం చెప్పిన పనులు చేయటం ఉద్యోగుల బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

దర్శి, జూలై 1: దర్శి పట్టణంలో సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ తమీన్ అన్సారియా పరిశీలించారు. ఉదయం 8 గంటల సమయంలో నేరుగా దర్శి పట్టణంలోని శివాలయం వీధికి వచ్చారు. సచివాలయ సిబ్బంది అక్కడ పంపిణీ చేస్తున్న పింఛన్లను పరిశీలించారు. అప్పటివరకు జరిగిన పంపిణీపై ఆన్‌లైన్‌లో తనిఖీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నారా, లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రంలోపు 99 శాతం పూర్తి చేయాలన్నారు. సాంకేతిక కారణాలవల్ల ఎక్కడైనా నిలచిపోతే మంగళవారం పూర్తిచేసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యవైఖరి అవలంబించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ సుజాత, నగర పంచాయతీ కమిషనర్ వైమహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మంత్రి

తూర్పునాయుడుపాలెంలో పింఛన్‌ల పంపిణీ ప్రారంభం

టంగుటూరు, జూలై 1 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఆయన సోమవారం ఉదయం ఆరు గంటలకు పింఛన్‌ల పంపిణీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పింఛన్‌ను ఒకేసారి రూ.వెయ్యి పెంచి నెలకు రూ.4వేలు ఇస్తున్నదని చెప్పారు. కొత్త ప్రభుత్వం అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు పెంచి పంపిణీ చేస్తున్నదని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ ఇస్తామన్నారు. తొలుత తూర్పునాయుడుపాలెంలోని కోనేటి ఒడ్డునున్న శ్రీఆంజనేయస్వామి విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి స్వామి పూజలు చేశారు. అనంతరం ఎస్సీ కాలనీలోకి ప్రవేశించారు. ముందుగా కసుకుర్తి రవీంద్ర అనే దివ్యాంగురాలికి పింఛన్ సొమ్ము అందించారు. అనంతరం అద్దంకి రామయ్యకు వృద్ధాప్య పింఛన్‌ను ఇచ్చి ఆయనచేతనే ముఖ్యమంత్రి సందేశం చదివించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, సర్పంచ్ తలపనేని రవికుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాతూరి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారుల్లో ఆనందం
- సచివాలయ ఉద్యోగులతో పాలుపంచుకున్న టీడీపీ నేతలు
- ఇంటి వద్దకే పెంచిన పింఛన్
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జూలై 1 : ఎన్నికల సమయంలో ప్రజలకు టీడీపీ కూటమి ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఇంటివద్దకే పంపిణీ చేశామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో సోమవారం బీసీ కాలనీలో వీల్‌చైర్‌కు పరిమితమైన గుంజి వెంకటవిజయ్, గుంజి భానుప్రకాష్‌కు రూ.15వేల పింఛన్‌ను మంత్రి గొట్టిపాటి అందజేశారు. కదలలేనిస్థితిలో ఉన్న ఇద్దరి చిన్నారుల పరిస్థితి, వారి పోషణ విషయాన్ని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్‌లను పెంచుతున్నట్లు ప్రకటించడంతోపాటు జూలై 1వ తేదీన ఇళ్ల వచ్చి అందజేశారని అన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు పింఛన్‌ను రూ.2వేలకు పెంచగా 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రూ.3వేలకు పెంచుతున్నట్లు హామీ ఇచ్చి ఐదేళ్లపాటు పెంచకుండా వృద్ధులను మోసం చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఉదయం 6 గంటల నుంచే ఇళ్లవద్దకు వెళ్లి సిబ్బంది పింఛన్‌లు అందజేశారని గొట్టిపాటి తెలిపారు. 90 శాతంపైగా అందించారని తెలిపారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు డీఎస్సీని ప్రకటించి ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో విధ్వంసం, దాడులతో ప్రజలు భయంతో జీవించారని, కూటమి ప్రభుత్వం రాకతో ప్రజలు స్వేచ్ఛగా, ఆనందంగా జీవిస్తున్నారని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన అందిస్తామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో మ్యాత్యూబాబు, టీడీపీ నాయకులు చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు, బొప్పూడి నాగేశ్వరరావు, శింగమనేని శ్రీనివాసరావు, గరిమిడి జగన్మోహనరావు, బొప్పూడి వీరయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, బత్తుల వెంకటరావు, ఈవోఆర్డీ రాంబాబు, కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సత్యవర్ధనరావు, రావుల వెంకయ్య, జక్రయ్య పాల్గొన్నారు.

అద్దంకి, జూలై 1 : పింఛన్‌ల పంపిణీ పండుగలా సాగింది. పెంచిన పింఛన్‌తోపాటు బకాయి కలిపి రూ.7వేలను అందజేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లువిరిసింది. పట్టణంలోని అన్ని వార్డులలో పింఛన్‌ల పంపిణీలో సచివాలయాల సిబ్బందితో పాటు కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్‌లు,


దేవరపల్లి ఎస్సీ కాలనీలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో టీడీపీ నేత కోనేటి అనిల్ ఆధ్వర్యంలో పింఛన్‌తోపాటు స్వీటు బాక్సులను అందజేశారు. 5వ వార్డులో సీఎం బాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

అద్దంకిటౌన్ : మండలంలో మొత్తం 90. 31శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ అయిన బలరామకృష్ణపురంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. మండలంలోని చిన్నకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్‌కు చెందిన బైలడుగు అనంతమ్మ పాము కాటుకు గురై ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మి ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు వెళ్లి అనంతమ్మకు పింఛన్ అందజేశారు.

చంద్రబాబు సాయాన్ని జీవితంలో మర్చిపోలేం



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మూడు వేలు ఉన్న దివ్యాంగ పింఛన్‌ను రూ.6వేలకు పెంచారు. ఆయన సాయాన్ని జీవితంలో ఎన్నటికీ మర్చిపోను. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి రూ.1000 పెంచినట్లు హామీ ఇచ్చి ఐదేళ్లకు గాని ఇవ్వలేదు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే పింఛన్ ఇచ్చారు. ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం ఆనందంగా ఉంది.

బల్లికురవ : టీడీపీ ప్రభుత్వం నూతనంగా పెంచిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం గ్రామాలలో పండగలా సాగింది. 21 పంచాయతీలలో 7842 మందికి పింఛన్‌లు అందించాల్సి ఉంది. చంద్రబాబు రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. పెండింగ్‌తో కలిపి సోమవారం ఉదయం రూ.7వేలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ ఇవ్వడం, ఒక్కసారిగా పెద్ద మొత్తం రావడంపై పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ రాజేష్, ఎంపీడీవో హనుమారెడ్డి, తహసీల్దార్ సుభద్ర, ఈవోపీఆర్డీ సుమతిలు పర్యవేక్షించారు.

చెన్నుపల్లిలో చంద్రబాబుకు పాలభిషేకం

ముఖ్యమంత్రి చంద్రబాబు వృద్ధులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.7వేల పింఛన్‌ను సోమవారం పంపిణీ చేయడంపై చెన్నుపల్లి గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. వృద్ధులు మాట్లాడుతూ బాబుకు, మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గొట్టిపాటి శంకర్, ఆళ్ల చంద్రమౌళి, యాగంటి సింగరయ్య పాల్గొన్నారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలో పింఛన్‌ల పంపిణీ 93 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో సమతవాణి తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు పంపిణీలో పాల్గొన్నారు. పమిడిపాడులో మండల పార్టీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణతోపాటు అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు పంపిణీలో పాల్గొన్నారు.

చేసేది చెప్తాం..చెప్పింది చేస్తాం : ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : చేసేది చెప్తాం .. చెప్పిందే చేస్తాం. ఇది టీడీపీ ట్యాగ్ లైన్.. సీఎం చంద్రబాబు ఒక్కరికే అది సాధ్యం. ఆయన సారథ్యంలో మేమంతా అభివృద్ధి, సంక్షేమం రాజ్యంలో ముందుకు సాగుతున్నాం. అందుకు ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో సూర్యోదయం నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఇలా అన్ని రకాల పెన్షన్లు పొందుతున్న అర్హులైన లబ్ధిదారుల్లో ఒక్కో ప్రాంతంలో కొందరికి ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండయ్య, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తదితరులను ఆశీర్వదిస్తూ హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని వార్డులలో ఆయా ప్రాంతాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది సమిష్టిగా పాల్గొని పెన్షన్ల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలో పింఛన్‌ల పంపిణీలో అధికారులతో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలా టీడీపీ కూటమి నాయకులు, అధికారులు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొదవీరయ్య, యార్లగడ్డ లక్ష్మీ, రాయని ఆత్మారావు, సందు శ్రీనివాసరావు, టీ.జయరావు, మోటుమర్రి రామసుబ్బారావు, బెల్లంకొండ రమేష్‌బాబు, ఆసోది సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

సందడిగా పింఛన్‌ల పంపిణీ

పర్చూరు : పింఛన్ల పంపిణీతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం 6గంటలకే అధికారులతో కలసి కూటమి శ్రేణులు లబ్ధిదారుల ఇంటి వద్దకు చేరుకొని పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా తొలి పింఛన్‌ను అందజేశారు. ఏలూరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో జి.రవీందర్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య పాల్గొన్నారు.

యద్దనపూడి, (మార్టూరు) : యద్దనపూడి మండలంలో 14 గ్రామ పంచాయతీ పరిధిలో 9 గ్రామ సచివాలయాలకు చెందిన 80 మంది సచివాలయ ఉద్యోగులు గ్రామాలలో పెన్షన్లు పంపిణీ చేశారు. 85 శాతం మందికి పెన్షన్లను అందచేసినట్లు ఎంపీడీవో శివసుబ్రమణ్యం తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్ కరుణశ్రీ యద్దనపూడి గ్రామంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్టూరు మండలంలో సాయంత్రానికి 93 శాతంపైగా పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నితిన్, మార్టూరు పంచాయతీ ఈవోశ్రీనివాసరావు తెలిపారు. రామ్‌నగర్‌లో టీడీపీ నాయకులు పెన్షన్లు పంపిణీలో పాల్గొనగా లబ్ధిదారులు సీఎం బాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, మందపాటి అంజయ్య, తొండెపు ఆదినారాయణ, కాకోలు వెంకటేశ్వర్లు,రాంబాబు, తిరుమలరావు, శివ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేవుళ్ల మాదిరిగా వచ్చారు.. చల్లగా ఉండండి

పెన్షన్ సొమ్ము అందుకున్న లబ్ధిదారు

చీరాల : అయ్యా దేవుళ్ల మాదిరిగా వచ్చారు. మంచంలోనే ఉంటున్నాను. వ్యాధితో ఇబ్బంది పడుతున్నాను. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఏం చేద్దామనే ఆలోచనతో దిక్కుతోచక దేవుడిపై భారం వేసి కాపాడు తండ్రీ అని వేడుకుంటున్నాను. ఈ రోజు మీరు పిలవని దేవుళ్ల మాదిరిగా వచ్చి ఆదుకున్నారు. మీ మేలు ఆజన్మాంతం గుర్తుంచుకుంటానని చీరాల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ఎమ్మెల్యే కొండయ్య ఇతర నాయకులు, అధికారులు ఓ వృద్ధురాలికి పెన్షన్ సొమ్ము ఇచ్చే సందర్భంగా ఆమె అన్న మాటలివి. ఇలా నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ పెన్షన్ సొమ్ము ఒక్కసారిగా రూ.7వేలు పొందడంపై భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టిన వారు అనేకులున్నారు. మాది బాధ కాదయ్యా ఆనందభాష్పాలని అందరూ స్పందించారు.





చీరాల పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య.. అద్దంకిలో సీఎం బాబు చిత్రపటానికి పాలభిషేకం.. పమిడిపాడులో పింఛన్ అందజేస్తున్న జయకృష్ణ, మార్టూరులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న శ్రేణులు


కాలినడకన తిరుపతికి వెళ్తున్న రేణంగివరం టీడీపీ నేతలు

తిరుమలకు రేణంగివరం టీడీపీ శ్రేణుల పాదయాత్ర

పంగులూరు, జూలై 1 : మండలంలోని రేణంగివరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ మొక్కు తీర్చుకునేందుకు సోమవారం కాలినడకన తిరుమలకు బయలుదేరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు, ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించి మంత్రి పదవి చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన టీడీపీ నేత ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది పురుషులు, మహిళలు వెంకన్న సన్నిధికి పాదయాత్ర ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన ఆలయాలలో పూజలు చేసి నడక మొదలుపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, బాలిన రామసుబ్బారావు, గుర్రం ఆదిశేఖర్, చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, ఎర్రం శ్రీనివాసరెడ్డి, కుక్కపల్లి ఆంజనేయులు, జగన్మోహనరావు, అశోక్, జక్రయ్య, పూర్ణచంద్రరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

రామకూరు నుంచి తిరుమలకు

ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రామకూరు గ్రామానికి చెందిన టీడీపీ అభిమానులు కల్లూరి సుబ్బయ్య, కొల్లూరి కిషోర్ తిరుమలకు కాలినడకన మొక్కుతీర్చుకునేందుకు బయలుదేరారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా రావాలని, కాలినడకన కొండకు వస్తామని మొక్కుకున్న సుబ్బయ్య, కిషోర్ సోమవారం తిరుమలకు బయలుదేరారు. టీడీపీ గ్రామ నేత ఎడవల్లి అశోక్, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

అమరావతిపై స్టే తొలగింపునకు ప్రభుత్వం దృష్టి సారించాలి

చీరాల, జూలై 1 : అమరావతిపై సుప్రీంకోర్టులో కొనసాగుతున్న స్టే తొలగింపునకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఇంజనీరు నక్కల రమణారావు సోమవారం ప్రభుత్వాన్ని కోరారు. అందుకు సంబంధించి పూర్తి వివరాలను విశదీకరించారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు


ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న తహసీల్దార్

పేరాల(చీరాలటౌన్), జూలై 1 : మానవాళికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని తహసీల్దార్ నాసరయ్య అన్నారు. పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పావళ్ల శివ వరప్రసాద్ ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన సన్మాన సభలో ముఖ్యఅతిథిగా తహసీల్దార్ పాల్గొని పావళ్ల దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్ఈవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణి, ప్రధానోపాధ్యాయులు సాల్మన్, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, పవని భానుచంద్రమూర్తి, చంద్ర శేఖర్, సుశీల, కృష్ణమోహన్, కుమార్, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా రంగాల్లో స్థిర పడాలి


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు వీరయ్య

చినగంజాం, జూలై 1 : విద్యార్థులు బాగా చదివి సేవ చేసే రంగాలలో స్థిర పడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మల్లారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని మున్నంవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మనుషులను బతికించే దైవ శక్తులుగా వైద్యులు ప్రజలకు సేవలందిస్తున్నారని హెచ్ఎం అన్నారు. పాఠశాలలో ఐదవ తరగతి చదవుతున్న విద్యార్థిని గునిమిని హర్షిణి వైద్యురాలి వేషధారణలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు అందజేశారు. వైద్యురాలిగా వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, పీ హిమవంతేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే

అద్దంకిటౌన్, జూలై 1: వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టర్డ్ అకౌంటెంట్ కోటా శ్రీనివాసకుమార్‌ను, డాక్టర్ గొట్టిపాటి సత్యనారాయణ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వాసవి క్లబ్ సభ్యుడు తమ్మన శ్రీనివాసరావు పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా శింగరకొండలోని శ్రీరామ స్థూపం వద్ద మొక్కలు నాటారు. అలాగే వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ వెంకట ఆదినారాయణ, పెద్ద ఆంజనేయులు, ఉమఅన్నపూర్ణ, వనితా క్లబ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అద్దంకిటౌన్, జూలై 1: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి 2024-25 నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం స్థానిక క్రాంతి నర్సింగ్ హోం ఆవరణంలో రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుగా చప్పిడి వీరయ్య, కార్యదర్శిగా చుండూరి మురళీసుధాకరరావు, కోశాధికారిగా మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్‌గా షేక్ మహమ్మద్ రఫిని ఎన్నుకున్నారు. దాతలు, సభ్యుల సహకారంతో రోటరీ సేవలను అధికంగా చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు మాజీ అధ్యక్షుడు చిన్న మురళీకృష్ణ, డాక్టర్ దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, శ్రీరామచంద్రమూర్తి, దివాకర్‌దత్తు, శ్రీలక్ష్మి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ ఫణీంద్రబాబు దంపతులను రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 1 : దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరసైనికుడు పుట్టా సుబ్బారావు జయంతి సందర్భంగా సోమవారం మార్టూరు లో అతని కుటుంబసభ్యులు వెంకయ్య ఆశ్రమంలో పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. మొదట సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో సుబ్బారావు, శివ, అయ్యప్పస్వామి, రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనిల్‌రావిపూడి పూజలు

యద్దనపూడి, (మార్టూరు) జూలై 1 : యద్దనపూడి మండలం చిలుకూరివారిపాలెంలో సినీ దర్శకులు అనిల్ రావిపూడి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేష్‌తో కొత్త సినిమాకు రాసిన స్క్రిప్టుతో తన స్వగ్రామమైన చిలుకూరివారిపాలెంలో స్క్రిప్టుతో దేవాలయంలో పూజలు చేశారు.


పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

నూజెళ్లపల్లి గ్రామ సర్పంచ్ మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జూలై 1 : మండలంలోని నూజెళ్లపల్లి గ్రామ సర్పంచ్ మద్దినేని పార్వతమ్మ (70) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం అస్వస్థతకు గురైన సర్పంచ్ పార్వతమ్మను చికిత్స నిమిత్తం ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ పార్వతమ్మ గుండెపోటుతో మరణించగా, పార్వతమ్మ మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు జరిగాయి.

అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సర్పంచ్ మద్దినేని పార్వతమ్మ కుటుంబ సభ్యులను విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరామర్శించారు. పార్వతమ్మ మృతికి కారణాలను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మద్దినేని చైతన్య, గుర్రం ఆదిశేఖర్, గొట్టిపాటి కాజా, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులను బాగు చేయాలి

ఇంకొల్లు, జూలై 1 : మంచి నీటి చెరువులను బాగు చేయాలని గ్రామ సభలో గగ్గోలు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రామ సభల్లో ప్రజల సమస్యలు అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పరిష్కారం జరగలేదనో.. అధికారులకు ఒకే సమస్య ఎన్నిసార్లు చెప్పినా వారి నిర్లక్ష్య వైఖరితో ఉన్నారనో...తూతూమంత్రంగా పేరుకు జరిగే ఈ గ్రామసభలకు వెళ్లినా ప్రయోజనం లేదనో కానీ ఇంకొల్లు పంచాయతీలో సోమవారం జరిగిన గ్రామసభకు ప్రజల స్పందన కరువైంది. పట్టుమని పది మంది కూడా కనిపించలేదు. అలాగని గ్రామంలో సమస్యలు లేవనుకోవడానికి లేదు. నాలుగైదు నెలలుగా శివాలయం బజారులో చిన్నపాటి వర్షం కురిసినప్పుడు మురుగు నీరు, వర్షపు నీరు ఏకమై రోడ్డు మీద ప్రవహిస్తూ ఇబ్బందిపడుతున్నామని అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. సభకు వచ్చిన ఐదారుగురు చెరువులు బాగు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థ బాగులేక ఎక్కడ మురుగునీరు అక్కడే రోడ్లపై పడుతోందని అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. చాలాకాలంగా ఈ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం జరగలేదని వాపోయారు. ఇంకొల్లు పంచాయతీ పరిధిలోని ఇంకొల్లు, హనుమోజీపాలెం గ్రామాలలో ఉన్న మంచినీటి చెరువులను బాగు చేసి రక్షిత మంచినీటిని అందించాలని గ్రామస్థులు అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. నాగులచెరువుకు తమ ట్రాక్టర్‌తో నీళ్లు పెడితే రెండేళ్లు గడిచినా బిల్లు ఇవ్వలేదని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తపరిచాడు. ఇంకొల్లు నాగులచెరువు వ్యర్థాలతో నిండి నీరు కలుషితమవుతున్నాయని చెరువు బాగుచేయాలని ఈఓకు వినతిపత్రం అందజేసారు. ఈ గ్రామసభలో సెక్రటరీ కోటినాగయ్య, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నర్సరీని ప్రారంభించిన మంత్రి

పంగులూరు, జూలై 1 : మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామ రైతు కట్టింపూడి కోటేశ్వరరావు ఏర్పాటు చేసిన నర్సరీ పామ్స్‌ను విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. నర్సరీ ద్వారా మెరుగైన ఉత్పత్తులను రైతాంగానికి అందించాలని గొట్టిపాటి నర్సరీ యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో నేతలు నార్నె సుబ్బారావు, చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, ఏడుకొండలు, నార్నె శ్రీనివాసరావు పలువురు స్థానిక నేతలు, రైతులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, జూలై 1 : డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ దానిని అరికట్టడానికి జాగ్రత్తలు, అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు అన్నారు. సోమవారం అద్దంకి పట్టణం లో మోదేపల్లి పీహెచ్‌సీ, పట్టణంలోని గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో డయేరియా వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మనోజ్, డాక్టర్ జయసింహా, డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ మాధురి పాల్గొని జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు ఆశాలు, ఏఎన్ఎంలు ఇం టింటి ప్రచార కార్యక్రమం నిర్వహించడం, 0-5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు సత్తర్, వెంకాయమ్మ, సబిత, జానీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

పరిశుభ్రతతో రోగాలు దూరం

చీరాలటౌన్ : తినే ఆహారం నుంచి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన రోగాలు దరిచేరవని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి పేర్కొన్నారు. డెంగ్యూ వ్యతిరేఖ మాసోత్సవం డయేరియా నియంత్రణలో భాగంగా మునిసిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.యాకోబు, డా.శిరీష, డా.మనీష్‌నంద, చింతా శేషబాబు, మునిసిపల్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : ప్రజలు డయేరియాపట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అతిసార వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకె ట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.సాయి శ్రీచరణ్, పీహెచ్ఎన్. బేబి, హెచ్‌వీ ఉల్దారాణి, శ్యాంసుందరబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆయాలు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

మృతుడిది తాడేపల్లిగూడెం



చీరాలటౌన్, జూలై 1 : ఆర్థిక సమస్యలతో తాడేపల్లి గూడెంకు చెందిన ప్రైవేటు ఉద్యోగి బలవన్మరణం చెందారు. ఈ ఘటన సోమవారం చీరాల పట్టణంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే తాడేపల్లి గూడెంకు చెందిన కోరాడ అయ్యప్ప కుమార్(40) ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగి. ఇతను వారం కిందట భార్య జ్యోతి బాబుతో చీరాలకు ఉద్యోగం నిమి త్తం వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలలోని ఓ లాడ్జిలో మధ్యా హ్నం రూము అద్దెకు తీసుకున్నారు. రాత్రయిన గది తెరవకపోవడం, భోజనం విషయమై లాడ్జి నిర్వాహకులు తలుపు తెరిచి చూశారు. అప్పటికే కుమార్ రెండు చేతుల నరాలను బ్లేడుతో కోసుకుని రక్తపు మడుగులో విగతజీవిగా ఉన్నారు. దీంతో నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వేమన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. భార్య జ్యోతి భర్తను చేసి బోరున విలపించింది. ఆర్థిక సమస్యలే కారణమంటూ పోలీసులు భావిస్తున్నారు.

రెండు ఆటోలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు

బల్లికురవ, జూలై 1 : మల్లాయపాలెం బస్టాప్ సమీపంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదవార్త తెలిసిన వెంటనే పోలీసు లు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఇద్దరినీ చిలకలూరిపేటకు తరలిం చారు. ఒక డ్రైవర్ గణేష్‌గా గుర్తించగా, మరో డ్రైవర్ వివరాలు తెలియలేదు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

పర్చూరు, జూలై 1 : కౌలు సాగు చేస్తున్న రైతులందరికీ గుర్తింపు కార్డులను అందించేలా చర్యలు చేపడుతుందని ఏవో ఎస్.రామమోహన్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు.

ఎంపీడీవో మృతి



చినగంజాం, జూలై 1 : చినగంజాం ఎంపీడీవో యాటీ వరప్రసాద్ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గత నెల 27వ తేదీ రాత్రి 9గంటలకు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై విజయవాడలోని ఆంధ్ర హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటర్ వైద్యశాలలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా మాచవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ చినగంజాంకు బదిలీపై వచ్చారు. ఫిబ్రవరి 1, 2024 నుంచి చినగంజాం ఎంపీడీవో పనిచేస్తున్నారు. ఆయన మృతితో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే సాంబశివరావు సంతాపం తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్టర్ రంగారావు మృతి



అద్దంకి, జూలై 1 : మున్సిపల్, ఆర్అండ్‌బీ కాంట్రాక్టర్ నాదెండ్ల రంగారావు(74) సోమవారం రాత్రి పట్టణంలోని కాకానిపాలెంలో మృతి చెందారు. రంగారావు నాలుగు దశాబ్దాలుగా అద్దంకిలో కాంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు. గత కొంత కాలంగా రంగారావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. రంగారావుకు ఇద్దరు కుమారులు సుబ్బారావు, రవి ఉన్నారు. సుబ్బారావు ప్రస్తుతం మున్సిపల్ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. మరో కుమారుడు రవి ఓ చానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. రంగారావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

రాతి ముఖమండప నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, జూలై 1 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన ఆలపాటి లక్ష్మీనారాయణ విరాళంగా రూ.1,01,116 చెక్కును సోమవారం ఈవో సుభద్రకు అందజేశారు.





ఇచ్చిన మాట ఎన్డీఏ ప్రభుత్వం నిలబెట్టుకుంది. సూర్యోదయానికల్లా లబ్ధిదారు తలుపు తట్టి మరీ పెన్షను సొమ్ము అందజేసింది. మొన్నటిదాకా చాలీచాలని సొమ్ముతో నెట్టుకొచ్చిన అవ్వాతాతలు ఒక్కసారిగా రూ.7వేల నగదు కళ్లారా చూసి మురిసిపోయారు. ఇక తమ కష్టాలు తీరినట్టేనని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

బోసినవ్వులు

విరబూశాయ్!



నెల్లూరులో పెన్షను సొమ్ము అందజేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

ప్రాణం ఉన్నంతవరకు టీడీపీతోనే..

విద్యుత్ షాక్‌తో నా ఎడమ చేయి, కుడి కాలు పూర్తిగా తొలగించబడ్డాయి. అప్పటినుంచి మంచానికే పరిమితమయ్యా. నా తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారు. 2014లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాకు రూ.3వేలు పింఛన్ మంజూరు చేశారు. ఎన్నికల్లో దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇస్తానంటే టీడీపీకి ఓటు వేశా. నేడు ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం సీఎం కాగానే మొదటి నెలలోనే మూడు వేలు ఉన్న పింఛన్ రూ.6వేలకు పెంచి ఇంటికే వచ్చి ఇచ్చారు. చంద్రబాబునాయుడు నా పాలిట కనిపించే దేవుడు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. ప్రాణం ఉన్నంత వరకు టీడీపీకే నా ఓటు.



- శ్రీనివాసులు, దివ్యాంగుడు, సంగం

చంద్ర బాబుకు రుణపడి ఉంటాం

పింఛను సొమ్మే నాకు ఆధారం. ఇలాంటి పరిస్థితుల్లో పింఛన్ మొత్తాన్ని రూ.5 నుంచి రూ.15వేలకు పెంచడం ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి పేదలకు ఇది భరోసాగా ఉంటుంది. ఇక నా అవసరాలకు ఎవర్నీ డబ్బు అడగాల్సిన అవసరం ఉండదు. చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం.



- షేక్ నాయబ్ రసూల్, దాసరిపల్లి, ఉదయగిరి

పేదల పక్షపాతి

మాట చెప్పినట్లుగా గతంలో ఇస్తున్న పింఛన్‌కు మరో వెయ్యి పెంచి రూ.4 వేలతోపాటు మే, ఏప్రిల్, జూన్ మాసాలకు సంబంధించిన బకాయిలు కలిపి మొత్తం రూ.7వేలు అందించడంతో చంద్రబాబునాయుడు పేదల పక్షపాతిగా మారారు. మా బాధలు అర్థం చేసుకుని ఇలా చేయడం గొప్ప విషయం.



- గొల్లపల్లి లక్ష్మయ్య, ఏసీ కాలనీ, దుత్తలూరు

● అట్టహాసంగా సామాజిక పింఛన్ల పంపిణీ

● ఆరు గంటలకే ప్రారంభమైన కార్యక్రమం

● పెరిగిన పింఛన్ అందుకోవడంతో వెల్లివిరిసిన ఆనందం

● ఇళ్లకు వెళ్లి అందజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

● తొలి రోజునే 94.99 శాతం పంపిణీ

● ఊరూరా చంద్రబాబుకు పాలభిషేకం



నెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పేదల మోములో ఆనందం వెల్లివిరిసింది. ఎన్డీఏ కూటమి ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని పెంచి ఒకటవ తేదీనే ఇంటి వద్ద అందజేయడంతో పేదల కుటుంబాల్లో సంతోషం నిండింది. జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. మంత్రుల నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు, కలెక్టర్ మొదలు సచివాలయ ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరూ పేదల గడప తొక్కి డబ్బులు అందజేయడం విశేషం. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ప్రతి గ్రామం, వార్డులో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. తొలిరోజునే దాదాపుగా లబ్ధిదారులందరూ పింఛను సొమ్ము అందుకున్నారు. ఉద్యోగులంతా నిబద్ధతతో పింఛన్లు పంపిణీ చేయడంతో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు 94.99 శాతం పంపిణీ పూర్తయ్యింది. మొత్తం 3,13,757 పింఛన్లకుగాను 2,98,044 పింఛన్లు అందించారు. అత్యధికంగా దగదర్తిలో 96.86 శాతం, కందుకూరులో 96.78, సైదాపురంలో 96.55 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. కొడవలూరులో 96.52 శాతం, బుచ్చిరెడ్డిపాళెం 96.46, ఆత్మకూరు అర్బన్ 96.44, కలువాయి 96.44, ఉలవపాడు 96.32, ఏఎస్‌పేట 96.3 శాతం పంపిణీ జరిగింది. ఒక్క లింగసముద్రం మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయింది. ఇక మరో 15,713 మందికి మాత్రమే పింఛన్ అందజేయాల్సి ఉంది. వీరిలో చాలా వరకు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడంతో వారికి ఉద్యోగులు పింఛన్ అందించలేకపోయారు.

● ఇంటింటికీ పింఛన్

ఉదయం ఆరు గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలైంది. ప్రజాప్రతినిధులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని పేదలకు ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. నెల్లూరు నగరంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. యలమవారిదిన్నె, జెండావీధి, కపాడిపాలెం, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎంపీ వేమిరెడ్డితో కలిసి ఆత్మకూరు నియోజకవర్గంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, చేజర్ల, మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లోని పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, మనుబోలు మండలాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను అందించారు. ముత్తుకూరు, టీపీ గూడూరు మండలాల్లో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పొదలకూరు మండలంలో సోమిరెడ్డి శృతిరెడ్డిలు పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎంపీ వేమిరెడ్డితో కలిసి పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం హరి నారాయణన్ పరిశీలించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని బుచ్చి, కొడవలూరు, కోవూరు మండలాల్లో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, ఎంపీ వేమిరెడ్డిలు పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. పడుగుపాడులో కలెక్టర్ పరిశీలించారు. కావలి నియోజకవర్గ పరిధిలోని కావలి పట్టణం, కావలి రూరల్, దగదర్తి, బోగోలు, అల్లూరు మండలాల్లో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కందుకూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. వీరితోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.



పొదలకూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న పింఛనుదారులు



వెంకటాచలంలో పింఛను పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి....



కోవూరులో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి..



నెల్లూరు : వృద్ధురాలితో వేలిముద్ర వేయిస్తున్న సచివాలయ ఉద్యోగి



కావలిలో పింఛనిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



సీతారామపురంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్..



వెంకటాచలంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి..



సంగం : పింఛను అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు (జడ్పీ) : పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని తట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే వెయ్యి దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి నెలకు 300యూనిట్లు పొందడమే కాకుండా ఏడాదికి రూ.15వేలు ఆదా అవుతుందని తెలిపారు.

సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం.. వైద్యులంతా ఉత్సాహంగా గడిపారు. తాము చేసిన, భవిష్యత్తులో తాము సాధించబోయే ప్రగతినీ వివరిస్తూ ఆనందంగా గడిపారు. ఇంతలో ఓ చేదు వార్త అందరినీ కలచి వేసింది. ఓ డాక్టర్ మరణవార్త విని అంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

ఉదయం నుంచి తోటి వైద్యులతో కలిసి శిక్షణలో ఆమె ఉత్సాహంగా పాల్గొంది. భోజన విరామం తర్వాత కూడా అదే ఉత్సాహంతో సహచరులతో మాట్లాడారు. అయితే, ఆ తర్వాత వచ్చిన ఓ ఫోన్ కాల్ ఆ గొంతును మూగబోయేలా చేసింది. ఫోన్ మాట్లాడుతూ మొదటి అంతస్థు నుంచి నాల్గవ అంతస్థుకు చేరుకున్న డాక్టర్ అక్కడ ఏం జరిగింది.. ఫోన్‌లో అవతల వ్యక్తి ఏమన్నాడో ఏమో గానీ కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడింది. సోమవారం నెల్లూరు వైద్యవిద్య కళాశాలలో జరిగిన ఈ ఘటన అందరినీ విషాద వదనంలోకి నెట్టేసింది.



డాక్టర్ జ్యోతి (ఫైల్)

ఏం జరిగిందో..

ఆ ఇంట ఆరిన జ్యోతి!

● నాల్గవ అంతస్థు నుంచి దూకి యువ వైద్యురాలి మృతి? ● మృతురాలు చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్

● ఫోన్‌లో మాట్లాడిందెవరో? : ఆరా తీస్తున్న పోలీసులు ● ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలో ఘటన

● కారణాలు తెలియవంటున్న భర్త ● 'డాక్టర్స్ డే' రోజునే విషాదం





ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, జ్యోతి మృతదేహం

నెల్లూరు (వైద్యం)/చేజర్ల జూలై 1: చేజర్ల మండలం చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నంబూరి జ్యోతి (34) డాక్టరుగా పని చేస్తోంది. 2022, సెప్టెంబరులో డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జ్యోతి రోగులు, సహచరులతోనూ కలివిడిగా ఉండేదని తెలిసింది. అందరిచేత మన్ననలు అందుకుంటున్న జ్యోతి కేన్సర్ వ్యాధిపై శిక్షణ కోసం సోమవారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు వచ్చారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం శిక్షణలో ఉండగా ఫోన్ రావటంతో మాట్లాడుతూ హడావిడిగా మొదటి అంతస్థు నుంచి నాల్గవ అంతస్థుకు చేరుకుంది. సుమారు మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో హడావిడిగా వెళ్లిన వైద్యురాలు ఫోన్‌లో మాట్లాడుతూ ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో అక్కడ నుంచి జ్యోతి కిందకు పడిపోయిన శబ్దాన్ని విని శిక్షణలో ఉన్న వైద్యులు బయటకు పరు గులు తీశారు. వెంటనే జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే జ్యోతి చనిపోయి నట్లు వైద్యులు నిర్ధారించా రు. కాగా, నాల్గవ అంతస్థులో నాలుగు అడుగుల ఎత్తు లో ఇనుప కంచె ఉంది. జారి కింద పడేందుకు అవకాశం లేదు. మానసిక సంఘర్షణకు లోనయిన జ్యోతి పైనుంచి కిందకు దూకి ఉండవచ్చని తోటి వైద్యులు చెబుతున్నారు. నాల్గవ నగర పోలీసులు కేసు నమోదు చేసి వైద్యురాలు మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కాగా, మృతురాలి భర్త రవిబాబు కూడా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్థోపెడి క్ వైద్యుడిగా పనిచేస్తున్నారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. హైదరాబాదులో ఉంటున్న జ్యోతి తల్లిదండ్రులు వస్తే తప్ప అసలు విషయాలు వెలుగులోకి రావు. ఘటనాస్థలిని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర దేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా పరిశీలించారు.

● రాత్రే సినిమాకు కూడా వెళ్లాం..

భార్య మృతితో డాక్టర్ రవి శోకసంద్రంలో మునిగిపోయారు. ఆదివారం రాత్రి ఇద్దరం సినిమాకు వెళ్లామని, సోమవారం ఉదయం కూడా తానే ప్రభుత్వ వైద్య కళాశాలలో శిక్షణకు తీసుకొచ్చినట్లు చెప్పారు. తన భార్య మృతికి కారణాలు చెప్పలేకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓపెన్ స్కూల్ ఫలితాల విడుదల

● టెన్త్‌లో 22, ఇంటర్‌లో అట్టడుగు స్థానం

నెల్లూరు (విద్య), జూలై 1: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఫలితాల్లో టెన్త్‌లో 22, ఇంటర్‌లో 26వ స్థానంలో జిల్లా నిలిచింది. జూన్‌లో జరిగిన టెన్త్, ఇంటర్ ప్రాక్టికల్స్, పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల చేశారు. టెన్త్‌లో 275 మందికి 108 మంది (39.27 శాతం), ఇంటర్‌లో 585 మందికి 211 మంది (36.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పాసైన విద్యార్థులు మార్కుల జాబితాలను www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. కాగా అభ్యాసకులు జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, రీకౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.200, రీవెరిఫికేషన్‌కు ఒక సబ్జెక్టుకు రూ.1000 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు దర్గామిట్టలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉన్న పరీక్షల విభాగంలో సంప్రదించాలని తెలిపారు.



దర్గా ముందు వర్షపు నీరు



చిన్న వర్షానికే ఇలా..

మరి పండుగనాడు ఎలా!

మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ మరో పదిహారు రోజుల్లో ఆరంభం కానుంది. కోరికలు తీరి కొందు.. కొత్త కోరికల కోసం ఇంకొందరు దేశ విదేశాల నుంచి ఎంతోమంది భక్తులు బారాషహీద్ దర్గాకు తరలివస్తారు. రాష్ట్ర పండుగగా జరిగే రొట్టెల పండుగ కోసం నగర పాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షానికి దర్గా ప్రాంగణంలోని లోతట్టు ప్రాంతలన్నీ జలమయం అయ్యాయి. ఎటు చూసినా బురద నెలకొంది. ఇప్పుడే ఇలా ఉంటే.. మరి రొట్టెల పండుగ జరిగే వారం రోజుల పరిస్థితి ఏమిటన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి లోతట్టు ప్రాంతంలో గ్రావెల్ తోలి కంకరతో చదును చేయాల్సిన అవసరం ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు







నీరు ఇలా ఉంటే ఏర్పాట్లు సజావుగా సాగేనా!?

ఊరూరా పింఛన్ల పండుగ

● పంపిణీలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ నేతలు
● పలు ప్రాంతాల్లో సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలభిషేకం

జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లోనూ, గ్రామాల్లోనూ సోమవారం పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు ఎన్డీఏ కూటమి నేతలు ఉదయం ఆరు గంటల నుంచే పెన్షన్ల పంపిణీని ప్రారంభించి, సాయంత్రం ఆరు వరకు కొనసాగించారు. పలుచోట్ల సీఎం చంద్రబాబు ఫ్లెక్సీలకు పాలభిషేకం చేశారు. ఆ వివరాలు..



అనంతసాగరం మండలం గౌరవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఆనం



కలిగిరి : పింఛన్ పంపిణీ చేస్తున్న చిరంజీవిరెడ్డి, తదితరులు



లింగసముద్రం : పెదపవనిలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు



వీవీ పాలెం : చెర్లోపాలెంలో సీఎం ఫ్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు



కొండాపురం : భీమవరప్పాడులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

ఆత్మకూరు : సోమవారం వేకువ నుంచే పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు, అధికారగణం ప్రతి ఇంటికి వెళ్లి పింఛను సొమ్ము అందించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆత్మకూరు మండలం బట్టేపాడులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి ఆనం పింఛన్లు అందజేశారు. 6వార్డులో ఆనం కౌవల్యారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఎన్డీసీసీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, ఆనం రంగమయూరరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కరటంపాడు, బి.చిరువెళ్ల గ్రామాల్లో సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు టీడీపీ నేతలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెంచలరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, మాజీ సర్పంచి పఠాన్ సాబ్జాన్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : సోమవారం ఉదయగిరిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు మన్నేటి వెంకటరెడ్డి, బయ్యన్న, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దుత్తలూరు ఏసీ కాలనీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, నాయకులు పేలపూడి వెంకటరత్నం, మల్లంపాటి గురవయ్యనాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, ఉండేల గురవారెడ్డి, కాకర్ల మధు, చల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

అల్లూరు : రాష్ట్రమంతా పింఛన్ల పండుగ వాతావరణం నెలకొందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని చెలికసంఘం గిరిజన కాలనీలో సోమవారం పింఛన్ల పంపిణీని ఆయన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బీద గిరిధర్, మాలేపాటి సుబ్బానాయుడు, బండి అమర్‌రెడ్డి, ఎంపీడీవో జ్యోతి, డీటీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● నగర పంచాయతీ కమిషనరు ఏరీ!?

ఎమ్మెల్యే కావ్య పర్యటనకు నగర పంచాయతీ కమిషనరు హాజరుకాకపోవడంతో సచివాలయ సిబ్బందిని కమిషనరు ఎక్కడ...? అంటూ ఆయన ప్రశ్నించారు. సమాచారం అందుకున్న కమిషనరు హుటాహుటిన తరలి వచ్చారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే చాక్లెట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు.

కావలి : పట్టణంలోని 5, 10, 15, 25,40 వార్డుల్లో సోమవారం ఉదయం పేదలకు పింఛన్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని 40 వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయకులతో కలిసి సచివాలయ సిబ్బంది చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, పోతుగంటి అలేఖ్య, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జీ. రాయకుమార్‌చౌదరి, బీజేపీ నేతలు జీ. భరత్‌కుమార్, కే, బ్రహ్మానందం జనసేన నేత పొబ్బాసాయి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : మండలంలోని గౌరవరం దళితవాడలో సోమవారం సర్పంచి దేవరపల్లి రాధిక అధ్యక్షతన ఎన్డీఏ కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి, చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. తదుపరి ఎమ్మెల్యే బీజేపీ నాయకులు కందుకూరి సత్యన్నారాయణ, సీవీ సత్యం, జీ. భరత్ కుమార్, జనసేన నాయకుడు సిద్దుతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో విజయ్‌కుమార్, టీడీపీ నేతలు ఆవుల రామక్రిష్ణ, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : మండలంలోని 17పంచాయతీల్లో సోమవారం పింఛన్ల పండుగ కనిపించింది. పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులతోపాటు ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు వంటేరు జయచంద్రారెడ్డి, నాయకులు యనమల శ్రీనివాసులు, కూటమి నాయకులు పీ మధురెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, తల్లపనేని మధుసూదనరావు, చేవూరి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : మండలంలోని మొగిలిచెర్లలో సోమవారం ఉదయం ఆరుగంటలకు టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో టీడీపీ నాయకులు గొర్రెపాటి సాంబయ్య ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. కాగా పెదపవని గ్రామంలో టీడీపీ శ్రేణులు చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి సాంబయ్య, గనిపినేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు : మండలంలో కొత్త పింఛన్లను సోమవారం పండుగ వాతావరణంలో పంపిణీ చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గుడ్లూరు ఎస్సీ కాలనీలో వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల రాఘవయ్య, రావూరి వేణు, ఉన్నం వెంకటేశ్వర్లు, చల్లా వీరరాఘవులు, మద్దసాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : స్థానిక ఒరిగిచేను సంఘం ఎస్టీ కాలనీలో లబ్ధిదారులకు సోమవారం పెరిగిన పింఛన్లను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అందచేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి ఇంటూరి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి, తహసీల్దార్ చంద్రారెడ్డి, ఎంపీడీవో విజయ, పంచాయతీ కార్యదర్శి విజయమ్మ, కూటమి నేత రాచగల్లు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం సెంటర్లో సోమవారం పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి కలిగిరిలో జరిగిన పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బిజ్జం కృష్ణారెడ్డి, బీఎపీ రామారావు, చీమల తాతయ్య, కట్టా వెంకటేశ్వర్లు, లెక్కల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నియోజకవర్గ ప్రజలందరికీ ఈ ఐదేళ్లు సేవకుడిలా పనిచేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరులో సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని కోటకట్టువీధిలో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, టీడీపీ నేతలు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, సయ్యద్ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని బడేవారిపాలెంలో సోమవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వేకువ జామునే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని నిద్రలేపి పింఛన్లు అందజేశారు. మండలంలోని 6,688 మంది లబ్ధిదారులకు రూ 4,44,52,000 నగదును అందజేశారు. చెర్లోపాలెంలో సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీలకు లబ్ధిదారులు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, పొడపాటి నరసింహం, ఇంటూరి రంగారావు, కాకుమాను హర్ష, వలేటి మధుసూదన్‌రావు, వీరమోసు అంజయ్య, కాకుమాను అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలో సోమవారం పింఛన్ల పంపిణీ 93 శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. 13 సచివాలయాల పరిధిలో అన్నిరకాల పింఛన్ల కలిపి మొత్తం 5,485 ఉండగా 5,056 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం 6 గంటల నుంచే పంపిణీని ప్రారంభించారు. మండల టీడీపీ కన్వీనర్ ఎమ్.ఓంకారం పలు గ్రామాల్లో పర్యటించి పంపిణీలో పాల్గొన్నారు. గొట్టిగుండాలలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమాల్లో అన్ని గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి దళిత కాలనీ, బేతనీపేట గ్రామాల్లో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరత్నం, ఎంపీడీవో జమమీ ఉల్లా,కూటమి నేతలు మాలేపాటి నాగేశ్వరావు, నూకసాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంగం : సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన సిద్దీపురం, సంగంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు ఎన్డీఏ కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యటనలకు వచ్చే తనకు ఇప్పటినుంచి నాయకులు శాలువాలు, పూలమాలలు తేవద్దని ఆనం కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, గిరినాయుడు, శ్రీనివాసులు యాదవ్, కె రవీంద్రరెడ్డి, కె కరుణాకర్‌రెడ్డి, ఆనం ప్రసాద్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

ఏఎస్ పేట: పేటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మినాయుడు, కొమ్మి ప్రదీప్ నాయుడు, ఆనం రంగమయూర్ రెడ్డి, నరసింహారెడ్డి, షేక్ జిలాని బాషా, షేక్ షబ్బీర్, ఖాదర్ బాషా, హరి, అక్బర్ పాల్గొన్నారు.

వింజమూరు: గుండెమడకలలో సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన హైస్కూల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గొంగటి రఘునాథ్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, జిల్లా నాయకులు గణపన్ సుదర్శన్‌రెడ్డి, చల్ల వెంకటేశ్వర్లు, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, గాలి నరసప్పనాయుడు, రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు చంద్ర మధుసూదనరావు, సుంకర అంజనాద్రి, సుంకర వెంకటాద్రి, పేరం సుధాకర్‌రెడ్డి, గుర్రం గోపి, తెల్లగొర్ల వెంకటయ్య, యరగూటి మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం



ఉదయగిరిలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



వరికుంటపాడులో పెన్షన్ అందిస్తూ...



జలదంకి : బ్రాహ్మణక్రాకలో సామాజిక పింఛను అందజేస్తున్న వంటేరు జయచంద్రారెడ్డి



కలువాయిలో పింఛను అందజేస్తున్న అధికారులు, నాయకులు

కలువాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి అన్ని గ్రామాల్లో ప్రజలు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, పీర్ల సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, ఎంపీడీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

సీతారామపురం: గ్రామంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బోగినేని కాశిరావు కంభం విజయరామిరెడ్డి, అధికారులు, సర్పంచ్ భాగ్యకుమారి, ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, దేవర వెంకటేశ్వర్లు పాల్గొనారు.

అనంతసాగరం : మండలంలోని సోమశిల, అనంతసాగరం, గౌరవరం గ్రామాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మునగపాటి సునీత, చంద్ర రాజయ్యనాయుడు, శాకమూరి వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, కాసా సుబ్బారెడ్డి, చల్లా నర్సారెడ్డి, గూడూరు శ్రీక్రాంత్‌రెడ్డి,ఆర్ సుజాతమ్మ పాల్గొన్నారు.

మర్రిపాడు:మండలంలోని పల్లవోలు, తిక్కవరం, మర్రిపాడు, డీసీపల్లి గ్రామాల్లో సోమవారం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ బస్సు కోసం చుంచులూరు విద్యార్థులు మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం, జూలై 1: స్థానిక ఐటీఐ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఫిట్టర్ గ్రూప్‌లో చేరదలచుకున్న వారు 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏడుకొండలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. .

ఉదయగిరిలో 38.6 మిల్లీమీటర్ల వర్షం

ఉదయగిరి, జూలై 1: నియోజవర్గలో ఆదివారం రాత్రి కురిసిన వర్షం 38.6మిల్లీమీటర్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వరికుంటపాడు, జూలై 1: విరువూరు మారుతినగర్‌లో సీతారాముల కల్యాణంను నిర్వహించారు. ముడియాల ఆంజేయరెడ్డి, సుజాత దంపతుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం తనిఖీ

ఉదయగిరి రూరల్, జూలై 1: గండిపాళెం, గుడినరవ, గానుగపెంటపల్లి గ్రామాల్లో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం గండిపాళెం పీహెచ్‌సీ హెచ్‌ఈ కలసపాటి వెంకటసుబ్బయ్య, టీబీ సూపర్‌వైజర్ బోగ్యం వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.

రెండువర్గాల మధ్య ఘర్షణ

ఉదయగిరి రూరల్, జూలై 1: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద టీడీపీలోని రెండువర్గాల మధ్య మాటమాట పెరిగి వివాదానికి దారితీసింది. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో రెండువర్గాలకు చెందిన కొందరు వ్యక్తులు ఘర్షణకు దిగారు. సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సర్దుబాటు చేసి పంపడంతో వివాదం సద్దుమణిగింది. అంతకుముందు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పట్టణంలోని ఎస్సీ కాలనీలో నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేసి వెళ్లారు.

కాలం బుజ్జిరెడ్డి కుటుంబానికి మంత్రి పరామర్శ

సంగం, జూలై 1: మండలకేంద్రంలోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి కుటుంబాన్ని సోమవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చేజర్ల, జూలై 1: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పెరుమాళ్లపాడు ఆనం గార్డెన్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజలకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పింఛన్ల పెంపు నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో 65లక్షల మందికి రూ.4,400 కోట్ల రూపాయలు పింఛన్ నగదును ప్రభుత్వం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఉదయం 6గంటల నుండి పింఛన్ల పంపిణీ ప్రారంభమై సాయంత్రానికల్లా 90శాతంపైగా పూర్తయ్యిందని మంగళవారానికి నూటికి నూరుశాతం పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జిల్లా సీఈవో కన్నమనాయుడు, ఆత్మకూరు ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

వరికుంటపాడు, జూలై 1: కాకొల్లువారిపల్లి అంకాళపరమేశ్వరి జాతరలో భాగంగా సోమవారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో కడప జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన సూరారెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. వీరికి మాజీమంత్రి మాదాల జానకిరాములు, యర్రా పెద్దశివరామయ్య జ్ఞాపకార్థం యర్రా చిన్నబ్రహ్మయ్య కుటుంబీకులు రూ.30వేలు ప్రోత్సాహక నగదు అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన అదే జిల్లా గోసురాయిపల్లికి చెందిన వెంకటరామిరెడ్డికి గొడుగులూరి పెద్దలక్ష్మయ్యకు గొడుగులూరి నరసింహనాయుడు జ్ఞాపకార్థం గొడుగులూరి చిరంజీవి రూ.20వేలు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన అదే జిల్లా పెద్దచిప్పాడుకు చెందిన శివప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరశర్మ ఎద్దులకు బత్తుల పెద్దతిమ్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రవీణ్, హైమ దంపతులు రూ.5వేలు అందజేసి అభినందనలు తెలిపారు.



విజేతలకు నగదును అందజేస్తున్న యర్రా చిన్నబ్రహ్మయ్య కుటుంబీకులు

విత్తన దుకాణాల తనిఖీ

ఆత్మకూరు, జూలై 1: పట్టణంలోని విత్తన దుకాణాలను సోమ వారం ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏడీఏ చెన్నారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వలు, స్టాకు రిజిష్టర్లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఆయన వెంట ఆత్మకూరు, మర్రిపాడు వ్యవసాయ అధికారులు కిషోర్‌బాబు, రామ్మోహన్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏడీఏ చెన్నారెడ్డి

నేడు అధికారులతో మంత్రి ఆనం సమీక్ష

ఆత్మకూరు, జూలై 1: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

లింగసముద్రం ఎంపీడీవోగా కట్టా శ్రీనివాసులు

లింగసముద్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కట్టా శ్రీనివాసులును ఇన్‌చార్జి ఎంపీడీవోగా జిల్లా ఉన్నతాధికారులు నియమించారు.ఈ మేరకు జడ్పీ సీఈవో నుంచి సోమవారం ఉదయం ఉత్తర్వులు రాగా, ఆయన వెంటనే విధుల్లో చేరారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

లింగసముద్రం : మండలంలోని పెంట్రాల పంచాయతీకి చెందిన గ్రేజింగ్ భూముల్లోని ఆక్రమణలను తొలగించాలని మాజీ సర్పంచి కిలారి కొండయ్య, టీడీపీ నాయకులు గోగుల మోహన్‌రావు, సీహెచ్ రమేష్, డి మధుసూదనరావు తదితరులు తహసీల్దార్ జీ శ్రీచరణను కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందచేశారు.

మీ ఆగడాలు ఇక సాగవు బ్రదర్.. !

బిట్రగుంట : అన్నీ రోజులు మావే అని ఎగిరి పడకూడదు... కాలం మారింది... ఇక మీ ఆగడాలు ఆపాలి... మీరే కాదు, నేను పూరామాస్ బ్రదర్.. అని ఈవోపీఆర్డీ శ్రీదేవి ఓ నేతను ఉద్దేశించి అనడం సంచలనంగా మారింది. బోగోలులోని బేతనీపేట వద్ద వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, తదితరులు నిర్మించుకున్న కట్టడాలను తొలగించాలని ఇదివరకే వారికి ఆమె తన సిబ్బంది ద్వారా తెలిపారు. తొలగించకపోవడంతో సోమవారం ఆమె దగ్గరుండి తొలగింపు చేపట్టారు. దీంతో వారి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.ఈ సందర్భంగా ఆమె పైవిధంగా అన్నారు.

వైభవంగా మహా శివలింగార్చన

కావలిటౌన్ : స్థానిక ముసునూరు హనుమత్ క్షేత్రంలో సోమవారం కోటి మృత్తిక మహా శివలింగార్చన వైభవంగా జరిగింది. ప్రసన్న వేంకటేశ్వర భజన మండలి, హనుమత్ క్షేత్ర ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రహోమం జరిగాయి. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అమరా విజయలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కావలి : బోగోలు మండలం కోవూరుపల్లి చెరువును ఆక్రమించి విక్రయించిన వారిపైనా, అందుకు సహకరించిన అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో శీనానాయక్‌కు ఆయన వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ బోగోలు మండలంలోని సీజేఎఫ్‌ఎస్ భూముల్లో కూడా రియల్టర్లు లేఅవుట్‌లు వేశారని, వీటన్నిటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాల పంపిణీ

కందుకూరు, జూలై 1: సక్షమ్ కందుకూరు శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌ఛైర్స్ ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను సోమవారం ఉచితంగా అందజేశారు. సీఆర్‌సీ,అనెన్కో ద్వారా అర్హులైన దివ్యాంగులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెన్నా రామాంజనేయులు, ఏరియా హాస్పటల్ మాజీ ఛైర్మన్ పిడికిటి వెంకటేశ్వర్లు, డాక్టరు తన్నీరు మల్లికార్జున, చక్కా కేశవ, అల్లూరయ్య, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లకు సన్మానం

కందుకూరు, జూలై 1: అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వాసవీ క్లబ్ లెజెండ్స్, వాసవీ వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లను సత్కరించారు.స్థానిక హరిణి వైద్యశాల డాక్టరు తన్నీరు మల్లికార్జున, న్యూ లైఫ్ హాస్పటల్ డాక్టరు కోటపాటి అనిల్‌కుమార్‌లను ఘనంగా సత్కరించి మొక్కలను బహూకరించారు. ఈ సందర్భంగా పేషెంట్లకు, సిబ్బందికి బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ, కొత్తూరి నటరాజకుమారి, నారాయణ సుకన్య, పేరూరి లలిత, గుర్రం మంజుల కుమారి తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : డాక్టర్స్‌డే పురస్కరించుకుని సోమవారం రిటైర్డు డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసారెడ్డిని పలువురు సత్కరించారు. స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని డాక్టర్ క్లినిక్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కావలి ఛైర్మన్ రవిప్రకాష్, హరినారపరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రోటరీ ప్రతినిధులు గోపీకృష్ణ, వెంకటసుబ్బయ్య, పీవీఎస్ ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు. పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్‌నాయడును సన్మానించారు. సంఘం అధ్యక్షుడు రమణయ్య, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే జాతి నిర్దేశకులు

కందుకూరు : ఉపాధ్యాయులే జాతి నిర్దేశకులని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన దామా లక్ష్మీనారాయణ దంపతులను సోమవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ వేలమంది జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలిగే అవకాశం ఒక్క ఉపాధ్యాయుడికే సొంతమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ప్రసాదరావు, ఎంఈవో సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు స్వాగతం

కావలిటౌన్ : నెల్లూరు రీజియన్ ఆర్టీసీ ఆర్‌ఎంగా నియమితులైన విజయరత్నంకు కావలి డిపోలో సోమవారం స్వాగతం పలికారు. విజయరత్నం విజయవాడ నుంచి నెల్లూరులో బాధ్యతలు స్వీకరించేందుకు వెళుతూ మార్గమధ్యంలో కావలిలో ఆగారు. డిపో వద్ద డీఎం రాపూరు శ్రీనివాసులు, అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కార్గో సూపర్‌వైజర్ రవిప్రకాష్, కంట్రోలర్ జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమదుస్తుల అందజేత

కావలిటౌన్ : ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కర్నాటి రోహిత్ తల్లి అనురాధ జయంతిని పురస్కరించుకుని సోమవారం సిబ్బందికి సమదుస్తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, కంటి వైద్యులు డాక్టర్ ప్రమీల పాల్గొని 75మంది ఆసుపత్రి సిబ్బందికి సమదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోహిత్ సతీమణి డాక్టర్ నాగభవాని తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో అగ్రగామిగా 'ప్రకాశం'

కందుకూరు : మౌలిక వసతుల కల్పనలో అగ్రగామిగా ఉండాలన్న లక్ష్యంతో తాము కాలేజీని నిర్వహిస్తున్నామని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో తొలిసంవత్సరం డిప్లమో తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సిహెచ్ రవికుమార్, డిప్లమో ఇన్‌చార్జి సులోచన, గురుశేషు, డీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.